# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption


హైదరాబాద్
4-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 162

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మంత్రిమండలి నుంచి బర్తరఫ్‌కు గురయ్యారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి సైతం ఉద్వాసనకు గురయ్యారు. తక్షణమే వీరిద్దరిని ఆయా పదవుల నుంచి తొలగించాలని సీఎం ఎ.రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్టు గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. కొండా సురేఖకు ఉద్వాసన పలకాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్‌కు సీఎం రేవంత్ సిఫారసు చేశారని తెలిపింది.

# కొండా సురేఖ బర్తరఫ్



### మంత్రివర్గం నుంచి తొలగింపు
### సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్
### ప్రణాళికా సంఘం నుంచి చిన్నారెడ్డికి ఉద్వాసన
### ముగ్గురు బీసీ మహిళలకు పదవులు

హైదరాబాద్:అయితే దీనిపై లోక్‌భవన్ గురువారం రాత్రి 8 గంటల వరకు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడంతో ఉత్కంఠ కొనసాగింది. కానీ సీఎం..మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో



## కాంగ్రెస్‌లో కొండా దంపతుల
## చాప్టర్ క్లోజ్!

# పట్టు బిగించిన రేవంత్!



### ధిక్కార స్వరాలకు గట్టి హెచ్చరిక
### కొండా సురేఖకు ప్రత్యామ్నాయంగా గుండు సుధారాణి
### బీసీ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పట్టును నిలుపుకున్నారు. కాంగ్రెస్ హై కమాండ్ వద్ద తన పరపతిని మరోసారి పెంచుకున్నారు. పార్టీలో ధిక్కారస్వరాలకు సరైన సంకేతాలు పంపారు. ఎంతటి ఉద్దండులైనా పార్టీ లైన్ దాటితే ఉపేక్షించేది లేదు అని నిర్దిష్టమైన సంకేతాన్ని పంపించగలిగారు. చేతల్లో చేసి చూపించారు. మంత్రివర్గం నుంచి రాజీనామా చేయాలని హై కమాండ్ ఇచ్చిన సూచనను మంత్రి కొండా సురేఖ ఖాతరు చేయలేదు. దీంతో ఏమాత్రం వెనుకడుగు వేయకుండా ఆమెను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేస్తూ గవర్నర్కు అధికారికంగా సిఫార్సు పంపారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** కేవలం ముఖ్యమంత్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సురేఖతోపాటు ఆమె కుమార్తె చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలతోనే పదవులు ఊడిపోయాయి. పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయి..

- మిగతా 3వ పేజీలో



# ప్రభుత్వ పెద్దల పక్కా కుట్ర!

### మాజీ మంత్రి కొండా సురేఖ
### సీఎం రేవంత్ పై నిప్పులు
### వేం నరేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డి పై విమర్శలు
### సామాన్య ఎమ్మెల్యేగా కొనసాగుతానని ప్రకటన

2లో



# ప్రైవేటుకు సింగరేణి!

### భూగర్భ గనులు ఎండీఏ విధానంలో ఇతరులకు..
### నష్టాల నివారణకు తప్పదు
### కేంద్ర బొగ్గు గనుల శాఖ కీలక సిఫార్సులు..

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సింగరేణి గనులను ప్రైవేటుకు అప్పగించే అవకాశం ఉందా? కేంద్ర సిఫారసులను సింగరేణి సీరియస్ గా పరిశీలన చేస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. సింగరేణి కాలరీస్ నష్ట నివారణ పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. భూగర్భ గనులలో భారీగా నష్టాలు నమోదవుతున్న తరుణంలో కేంద్రం కీలక సూచనలు చేసింది. భారీ నష్టాలను

- మిగతా 2వ పేజీలో

## భాగ్యనగరంలో నిమజ్జన వివాదం!

### చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు వద్దు అంటున్న హైడ్రా
### తప్పదు అంటున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి
### వివాదం మరింత జఠిలం
### సమన్వయానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం


2లో

## రైతు డిక్లరేషన్ నుంచి నీళ్ల దాకా..!

### రేవంత్ సర్కార్‌ను టార్గెట్ చేసిన కేటీఆర్ సంచలన ఆరోపణలు

### 'కేసీఆర్ చెప్పిందే నిజమైంది'.. యూరియా కొరతపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
### కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణ
### రైతు డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేశారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్
### రైతుబంధు, రుణమాఫీ, బోనస్ అంశాల్లో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు

3లో




# పోస్టర్ల వార్!

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై అధికార పార్టీ సంబరాలు
### దెబ్బతీసేందుకు ప్రధాన పట్టణాల్లో వ్యంగ్య పోస్టర్లు
### గులాబీ పార్టీ పని అని అనుమానం
### కౌంటర్ గా కాంగ్రెస్ గత పదేళ్ల వైఫల్యాలపై పోస్టర్లు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది కాంగ్రెస్ సర్కార్. తమ పాలనలోని విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు భారీగా నివేదికలు విడుదల చేసింది. పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు ఈ వేడుకల మూడ్ ను దెబ్బతీసేందుకు గులాబీ పార్టీ రంగంలోకి దిగింది.

- మిగతా 3వ పేజీలో

## భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు



### బీనామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు
### పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులు
### పక్కా ఆధారాలు సేకరిస్తున్న అధికారులు

2లో

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

### ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు
### ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
### ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక!
### మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్: ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు.



3లో



# భాగ్యనగరంలో నిమజ్జన వివాదం!

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** వినాయక చవితి సమీపిస్తోంది. హైదరాబాద్ మహానగరంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అయితే నిమజ్జనం అంశంపై ఇప్పుడు సరికొత్త వివాదం రాజుకుంది. భాగ్యనగరంలోని చెరువులు, జలాశయాల పునరుద్ధరణ తో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతలను భుజానికి ఎత్తుకుంది హైడ్రా. అయితే ఇప్పుడు హైడ్రా అభ్యంతరాలతో ఉత్సవాలు నిర్వహిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మధ్య భిన్నాభిప్రాయాలు ఘర్షణకు దారితీస్తున్నాయి. జిహెచ్ఎంసి, హైడ్రా ఆధ్వర్యంలో సుందరకరించి.. జీవవైవిధ్య కేంద్రాలుగా తీర్చిదిద్దిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనానికి అనుమతించేది లేదని హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఈ వివాదం మరింత పెరుగుతోంది.

**తీవ్ర అభ్యంతరాలు..**

హైడ్రా నిబంధనలపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం భక్తులు తమ ఆచారాల మేరకు చెరువుల్లో నిమజ్జనం చేస్తారని.. అడ్డుకునే హక్కు హైడ్రాధికారులకు లేదని స్పష్టం చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో భక్తుల విశ్వాసాలను, సెంటిమెంటును దెబ్బతీయవొద్దని.. ఎప్పటిలాగే అన్ని చెరువుల్లోనూ, ట్యాంక్బండ్ వంటి ప్రధాన ప్రాంతాల్లోనూ నిమజ్జనం చేసి తీరుతామని తేల్చి చెబుతున్నారు.

**సున్నితమైన అంశం..**

రాజకీయ అంశాలతో ఇబ్బంది పడుతోంది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పుడు ఈ సున్నితమైన వివాదం తెరపైకి రావడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ నగరంలో ఈ ఘర్షణ వాతావరణం శాంతిభద్రతల సమస్యగా మారుతుందని ఆందోళన కూడా ఉంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం తో పాటు పోలీస్ శాఖ సమన్వయ ప్రయత్నాలు ప్రారంభించింది. ఒకవైపు పర్యావరణ పరిరక్షణ, న్యాయస్థానాల ఆంక్షలను అమలు చేయాల్సిన బాధ్యత హైదరాబాద్ ఉంది. మరోవైపు భక్తుల భావోద్వేగాలను కూడా పరిశీలనలోకి తీసుకోవడం ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా మారింది. ఉత్సవాలు సమీపిస్తున్న కొద్దీ ఈ హైడ్రా వెర్సెస్ ఉత్సవ సమితి వివాదం మరింత ముదిరే అవకాశం ఉంది.

# ప్రైవేటుకు సింగరేణి!

తగ్గించుకునేందుకు కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా భారీ నష్టాల్లో ఉన్న భూగర్భ బొగ్గు గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే దిశగా అడుగులు వేస్తోంది.

**ఇతర సంస్థల మాదిరిగా..**

తాజాగా కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు గని అభివృద్ధి, నిర్వహణ ఎండిఓ విధానంలో ఈ బదిలీ జరుగుతుంది. కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్డ్ ఫీల్డ్ వంటి జాతీయ సంస్థలు ఇదే విధానం ద్వారా నష్టాలను తగ్గించుకుంటున్న నేపథ్యంలో.. సింగరేణి కూడా ఇలాంటి చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. మందమర్రి ప్రాంతంలోని శాంతిఖని భూగర్భ గనిని ప్రయోగాత్మకంగా అప్పగించేందుకు ఆసక్తి వ్యక్తీకరణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అందుకు ఓ ప్రైవేటు కంపెనీ ముందుకు వచ్చింది. దీనికోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. ఈ విధానంలో ప్రైవేటు సంస్థ సొంత ఖర్చుతో బొగ్గు తవ్వి.. నిర్ణీత ధరకు సింగరేణికి అందిస్తుంది. సింగరేణి ఆ బొగ్గును మార్కెట్లో విక్రయిస్తుంది.

**భారీగా నష్టం..**

ప్రస్తుతం టన్ను బొగ్గు ఉత్పత్తికి సుమారు రూ.21, 558 ఖర్చవుతుంది. కానీ విక్రయ ధర మాత్రం రూ.4167 మాత్రమే. అందుకే భూగర్భ గనుల తవ్వకాల్లో భారీగా నష్టం వస్తుంది. 2025 చివరి నాటికి 22 భూగర్భ గనులకు గాను 21 నష్టాల్లోనే ఉన్నాయి. వాటి మొత్తం నష్టం రూ.1924 కోట్లు. ఎంత నష్టాలలో ఉన్న సింగరేణి గట్టెక్కాలి అంటే ప్రైవేటీకరణ మార్గం అని కేంద్ర బొగ్గు శాఖ భావిస్తోంది. ఈ క్రమంలో ఎండిఓ విధానంలో ప్రైవేటుకు అప్పగించాలని సూచన చేసింది. లేదంటే సింగరేణి పూర్తిగా నష్టాల ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఉంది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఉపరితల గనులను నిర్వహిస్తోంది. ఉపరితల గనుల లాభాలతోనే భూగర్భ నష్టాలను పూడ్చుకుంటున్న పరిస్థితి ఉంది.

## ఆకాశ్ ఆనంద్ ఇంకా పరిణతి చెందలేదు

### బీఎస్పీ పార్టీ అధినేత్రి మాయావతి

న్యూఢిల్లీ: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పార్టీ అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద బాధ్యతలు చేపట్టే స్థాయిలో ఆయన ఇంకా పరిణతి సాధించలేదని స్పష్టం చేశారు. దీంతో వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ జాతీయ కన్వీనర్‌గా ఆకాశ్ ఆనంద్ పార్టీని నడిపించే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి. బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జాతీయ కమిటీ సమావేశంలో మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ ఆనంద్ పార్టీలో కొనసాగుతారని, అయితే ప్రస్తుతం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించడం సరికాదని చెప్పారు. పరిస్థితులను ఆయన పరిణతితో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. "ఆకాశ్ ఆనంద్ పార్టీలో పనిచేయడానికి నేను అనుమతించాను. అయితే ఈ విషయంలో ఆయన మరింత పరిణతి సాధించాలి.

# కాంగ్రెస్‌లో కొండా దంపతుల చాప్టర్ క్లోజ్!

**రాజీ పడి ఉంటే పదవి ఉండేదేమో**

**వ్యక్తులపైనే కాకుండా హై కమాండ్ పై కూడా తీవ్ర విమర్శలు**

**వివాదం ముగించకుండా రోజురోజుకు ఘర్షణ వైఖరి పెంచుతూ..**

**ప్రత్యామ్నాయ వేదికగా బిజెపి?**



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: తెలంగాణలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు అనేది సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ సురేఖను మంత్రివర్గం నుంచి బయటకు పంపించారు. అయితే కొండా సురేఖ ఒక వ్యూహం ప్రకారమే ధిక్కార స్వరం వినిపించి.. మంత్రివర్గం నుంచి తొలగింపు వరకు పరిస్థితి తెచ్చుకున్నారని స్పష్టం అవుతుంది.. రాష్ట్ర నాయకత్వాన్ని తిరస్కరించడమే కాదు.. పార్టీ హై కమాండ్ ను సైతం ధిక్కరించడంతో ఉద్వాసన తప్పలేదు. స్వయంగా సీఎం రేవంత్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం.. పార్టీ క్రమశిక్షణను ఖాతరు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. ఇంత జరిగాక కాంగ్రెస్ గూటిలో ఆత్మాభిమానంతో కొనసాగడం కొండా కుటుంబానికి ఎంత మాత్రం సాధ్యం కాదు. గత అనుభవాలు దీనిని తెలియజేస్తున్నాయి.

**ఫలించని ఢిల్లీ ప్రయత్నాలు..**

కొండా సురేఖ తన పదవిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హై కమాండ్ వద్ద తన వాదనను వినిపించేందుకు ఢిల్లీ వెళ్లి ఎంతగా ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. క్రమశిక్షణ ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ పెద్దలు సైతం వీరి విషయంలో ఎలాంటి ఉపశమనం ఇచ్చేందుకు సమ్మతించలేదు. సంక్షోభం తలెత్తిన ప్రారంభ దశలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం ద్వారా ఈ వివాదాన్ని తరలించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు సురేఖ. కానీ తరువాత కూడా ఆమె వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదు. పరిస్థితిని చక్కదిద్దేందుకు, డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు కొండా దంపతులు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. పైగా ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తూ.. పార్టీ అధినాయకత్వంతోనే ప్రగతింపులు చేసుకునే స్థాయికి వివాదాన్ని తెచ్చుకున్నారు.

**బిజెపి ఏకైక ఆప్షన్..**

కాంగ్రెస్ పార్టీలో ఉండి సీఎం రేవంత్ తో పాటు రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కొండా సురేఖకు సాధ్యం కాదు. పేరుకే ఆమె అధికార పార్టీ ఎమ్మెల్యే. కానీ ఒక్క అధికారం కూడా ఆమెకు ఉండే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో పార్టీలో ఉండి ఉండన్నట్టు కాకుండా.. దూకుడు రాజకీయాలు చేయాలంటే బిజెపి ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. బిజెపి ఉమ్మడి వరంగల్ లో బలమైన నేతల కోసం ప్రయత్నాలు చేస్తోంది . ఈ తరుణంలో కొండా దంపతులకు బిజెపి సరైన వేదిక అవుతుంది అనేది విశ్లేషకులు మాట. చూడాలి వారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో..

**రాజీ పడని తత్వం..**

రాజకీయాల్లో అవసరం అయితే రాజీ పడాలి. కానీ ఆ తత్వం కాదు కొండా దంపతులది. గతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న సమయంలోను అలానే చేశారు. తర్వాత గులాబీ పార్టీలోనూ అదే పరిస్థితి. తాజాగా కాంగ్రెస్ పార్టీలో కూడా అదే వైఖరిని అనుసరిస్తూ మంత్రివర్గం నుంచి తొలగించే దాకా పరిస్థితి తెచ్చుకున్నారు. క్యాబినెట్ నుంచి తప్పించిన వెంటనే వరంగల్ జిల్లాలో ప్రత్యామ్నాయంగా ఉన్న మరో బీసీ మహిళ నేత గుండు సుధారాణి తో పాటు ఇతర బీసీ నేతలను ప్రోత్సహించడం ద్వారా సురేఖను చెక్ పెట్టేందుకు రేవంత్ ప్రయత్నిస్తారు. అందుకే ఈ పరిస్థితిని తట్టుకునేందుకు వారు కాంగ్రెస్ పార్టీలో కొనసాగే అవకాశం లేదు.

# కొండా సురేఖ బర్తరఫ్

కలిసి రాత్రి 8 గంటల ప్రాంతంలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో 20 నిమిషాల పాటు భేటీ అయ్యారు. ఆ వెంటనే లోక్‌భవన్ నుంచి బులెటిన్ జారీ అయింది. సీఎం రేవంత్ సలహా మేరకు కొండా సురేఖను మంత్రిమండలి నుంచి తొలగిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నట్టు బులెటిన్ వెల్లడించింది. కాగా చిన్నారెడ్డి తొలగింపు నేపథ్యంలో ఆ పదవిని భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వం మరోరెండు కీలక నియామకాలు కూడా చేపట్టింది.

**రెండు వారాలుగా రాజకీయ దుమారం**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం నుంచి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రేవూరు ప్రకాశ్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 16న పరకాలలో జరిగిన బహిరంగ సభలో పిలుపునిచ్చారు. దీనిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఆగస్టు 19న కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ముఖ్యమంత్రిని ఉద్దేశించి పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డికి సీఎం కాగానే కళ్లు నెత్తికెక్కాయని, వచ్చే ఎన్నికల్లో దమ్ముంటే పరకాలలో ఆయన తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని వనపర్తి టికెట్‌ను ఇచ్చారని జి.చిన్నారెడ్డి సైతం వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన పార్టీ క్రమశిక్షణ కమిటీ వీరిద్దరికి ఉద్వాసన పలకాలని సిఫారసు చేస్తూ అధిష్టానానికి నివేదిక సమర్పించింది. ఈ పర్యావసానాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లడం, ఏఐసీసీ చీఫ్ ఖర్గే సహా కొందరు పెద్దల్ని కలవడంతో సురేఖతో పాటు జి.చిన్నారెడ్డిపై వేటు పడడం ఖాయమనే ఊహాగానాలు చెలరేగాయి. మరోవైపు సురేఖ కూడా మంగళవారం నాడే ఢిల్లీ వెళ్లారు. బుధవారం ఖర్గే తదితరులతో సమావేశమై అదే రోజు రాష్ట్రానికి తిరిగి వచ్చేశారు. కాగా రేవంత్‌రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరడానికి ముందు..సురేఖ, చిన్నారెడ్డి విషయంలో సీఎంఓ కార్యాలయంనుంచి ప్రకటన వెలువడింది. అంతకుముందే వీరిద్దరి ఉద్వాసనకు పార్టీ హైకమాండ్ ఆమోదం తెలిపింది.

**గజిట్ జారీ చేసిన ప్రభుత్వం**

సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రధాన సలహాదారు కె.రామకృష్ణారావు గురువారం సాయంత్రం లోక్‌భవన్‌కు వెళ్లి సీల్డ్ కవర్‌లో మంత్రిమండలి నుంచి కొండా సురేఖ తొలగింపు ప్రతిపాదనను అందజేశారు. అనంతరం ఢిల్లీ నుంచి సాయంత్రం 5 గంటలకు తిరిగి వచ్చిన సీఎం.. వెంటనే చంచల్‌గూడ -- సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించి, ఆ తర్వాత లోక్‌భవన్‌కు చేరుకుని గవర్నర్ శుక్లాతో భేటీ అయ్యారు. ఆ తర్వాత సురేఖ తొలగింపుపై లోక్‌భవన్ బులెటిన్ జారీ చేసింది. సీఎం వెంట ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రఘువీర్‌రెడ్డి ఉన్నారు. కాగా సురేఖను మంత్రిమండలి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం గజిట్ వెలువరించింది. సచివాలయంలోని 4వ అంతస్తులో ఉన్న కొండా సురేఖ కార్యాలయాన్ని సీజ్ చేశారు. అంతకు ముందే కీలకమైన ఫైళ్లన్నీ సీఎస్ కార్యాలయంలో అప్పగించాలని ఆమె పీఎస్‌ను ఆదేశించారు. సురేఖను మంత్రిమండలి నుంచి తొలగించడంతో ఆమె వద్ద ఉన్న పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖలూ సీఎం పర్యవేక్షణ కిందికి వెళ్లాయి.

# ప్రభుత్వ పెద్దల పక్కా కుట్ర!



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడం వెనుక ప్రభుత్వంలోని కొందరు కీలక నేతల పక్కా కుట్ర ఉందని మాజీ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ తీరుపై నిప్పులు చెరిగారు. ఉరిశిక్ష అమలు చేసే ముందు కూడా చివరి కోరిక ఏమిటనేది అడుగుతారని.. తనకు కనీసం ఎలాంటి కారణం చెప్పకుండా, ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఏకపక్షంగా ఉద్వాసన పలకడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవి తనకు కేవలం ఒక ఆభరణం మాత్రమేనని.. గతంలోనే తన చేతులతో రాజీనామా చేసిన చరిత్ర ఉందని గుర్తు చేసుకున్నారు. పదవి పోయిన ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని స్పష్టం చేశారు.

**ఆ నలుగురు బ్లాక్మెయిల్ తో..**

మరోవైపు తనను మంత్రివర్గం నుంచి తొలగించాలన్న భావన హై కమాండ్ కు లేదని.. ఏం నరేంద్ర రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు బ్లాక్మెయిల్ రాజకీయాలు చేసి తనపై కక్ష తీర్చుకున్నారని సురేఖ ఆరోపించారు. తన ఓఎస్డి సుమంత్ పేరు చెప్పుకొని కిరణ్ అనే వ్యక్తి డబ్బులు వసూలు చేస్తే.. బాధితుడి పైనే కేసు బనాయించి సిపిఎస్ కు బదిలీ చేశారని.. తీవ్రంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. సొంత ప్రభుత్వంలోనే తన మనుషులను ఈ స్థాయిలో ఇబ్బంది పెట్టడం చరిత్రలో ఎన్నడూ చూడలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ను, ఇందిరాగాంధీని మల్లు రవి, రోశయ్య, జైపాల్ రెడ్డి వంటి నేతలు తిట్టారని.. అంతెందుకు 50 కోట్ల రూపాయలు పెట్టి పిసిసి పదవి కొన్నారని రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేసిన వారికే నేడు పదవులతో పాటు సత్కారాలు దక్కాయని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తన కుమార్తె మాట్లాడిన మాటలకే తన మంత్రి పదవి తీసేస్తారా అని నిలదీశారు.

**వారంతా బయటకు రావాలి..**

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు సంతోషంగా లేరని.. వారంతా గుండెలపై చేయి వేసుకొని ఆత్మ పరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చారు సురేఖ.. పనులు కావాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈరోజు నాకు జరిగింది.. రేపు మీకు జరుగుతుంది. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు, అసంతృప్త నేతలు బయటకు వచ్చి గళం విప్పాలని ఆమె పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్లను మేమే అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. నిస్సిగ్గుగా ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి ఎలా తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు తమ కాళ్లు మొక్కి ప్రచారం చేయించుకున్న వాళ్లే నేడు తమను తప్పించే స్థాయికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వంపై అసంతృప్తి..**

ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు సురేఖ. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని సూచించారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని.. ఇప్పటికైనా ప్రభుత్వం తన నియంతృత్వ విధానాలు మార్చుకోకపోతే తీవ్ర నష్టం తప్పదని హెచ్చరించారు. నేనే పదేళ్లు సీఎం అని తనకు తానే ప్రచారం చేసుకోవడం.. ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజల నుంచే తాము ఎదిగామని.. ప్రజలకే జవాబుదారీగా ఉంటామని స్పష్టం చేస్తూ.. ప్రభుత్వంలోని అంతర్గత వ్యవహారాలు.. కుట్రలపై సమగ్ర వివరాలతో కూడిన బహిరంగ లేఖను ఆమె ఈ సందర్భంగా విడుదల చేశారు.

# పట్టు బిగించిన రేవంత్!

సీఎం రేవంత్ చర్యలకు ఉపక్రమించారు.

**ఆ నేతలకు గట్టి హెచ్చరిక..**

సురేఖ పై చర్యలు తీసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీలోని అసంతృప్త నేతలకు గట్టిగానే సంకేతాలు పంపగలిగారు. కాంగ్రెస్ పార్టీలో చాలామంది నేతలు ఆ మధ్యన తోక జాడించారు. వాస్తవానికి కొండా సురేఖ వెనుక చాలా పెద్ద తలకాయలు ఉన్నాయి అనేది ఒక వాదన. ఒకవైపు కొండా ఫ్యామిలీ ఎపిసోడ్ నడుస్తుండగా.. మంత్రి పదవి ఆశిస్తూ భంగపడుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ 20 మంది ఎమ్మెల్యేలతో ఓ ఫామ్ హౌస్ లో సమావేశమైనట్లు వార్తలు వచ్చాయి. రాజగోపాల్ రెడ్డి వ్యవహార శైలి కూడా అలానే ఉండేది. జడ్చర్ల ఎమ్మెల్యే తోపాటు కొంతమంది ఎమ్మెల్యేల వైఖరి కూడా మారింది. రోజురోజుకు సీనియర్ల వ్యాఖ్యలు విపరీత ధోరణిలో కొనసాగాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే కొండా సురేఖ పై చర్యలు తీసుకోవడం ద్వారా గట్టి సంకేతాలు పంపారు సీఎం రేవంత్ రెడ్డి.

**ముందే వ్యూహరచన..**



ఒక బీసీ మహిళ నేతపై వేటు వేయడం వల్ల ఉత్పన్నమయ్యే రాజకీయ పరిణామాలను తెలిసికూడా రేవంత్ దూకుడుగా వ్యవహరించారు. వ్యూహాత్మకంగా ముందుగానే నియంత్రించారు. కొండా సురేఖ తొలగింపు ద్వారా బీసీ వర్గాలకు ఏదో అన్యాయం జరిగిందనే విమర్శలు రాకుండా.. క్షణాల వ్యవధిలోనే కీలక నామినేటెడ్ పోస్టుల భర్తీతో సమాధానం చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సురేఖ వర్గానికి ధీటుగా.. బీసీ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ గుండు సుధారాణికి.. ప్రతిష్టాత్మకమైన కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్పర్సన్ గా బాధ్యతలు కట్టబెట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకురాలు నేరేళ్ల శారదను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా నేర్పిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్ పర్సన్ గా గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని చిన్నారెడ్డి స్థానంలో నియమించారు. సురేఖ వ్యవహారాన్ని ఒక సంక్షోభంగా మారనీయకుండా.. వరుస నియామకాలతో దానిని తన రాజకీయ పట్టును నిరూపించుకునే అవకాశం గా రేవంత్ మలుచుకున్నారు. కచ్చితంగా కొండా సురేఖ వర్గం తిరుగుబాటు చేయలేని స్థితిలో తన వ్యూహాన్ని చాటుకున్నారు రేవంత్.

## హర్మూజ్? పేరును 'ట్రంప్' జలసంధిగా మారుస్తాం

**అది అమెరికా కంట్రోల్?లోనే ఉంది : డొనాల్డ్? ట్రంప్?**

**ఇరాన్ రాడార్, క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేసాం**

న్యూఢిల్లీ: ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. హర్మూజ్ జలసంధి ఇప్పుడు అమెరికా నియంత్రణలో ఉందని, దానిపేరును ట్రంప్ జలసంధిగా మారిస్తే ఎలా ఉంటుందని అన్నారు. అమెరికా మాదిరిగా అది కూడా మునుపటి కంటే మరింత హాట్‌గా మారుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిపై సార్వభౌమాధికారం అమెరికాదేనని కొంతకాలంగా ప్రకటనలు చేస్తున్న ట్రంప్ దాన్ని అమెరికాలో కొత్త భూభాగంగా చూపుతూ ఇటీవల సోషల్ మీడియాలో ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ప్రారంభించిన యుద్ధానికి ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో అంతర్జాతీయ చమురు సరఫరాపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడింది. భౌగోళిక ప్రాంతాల పేర్లను మార్చటం ట్రంప్‌నకు ఇదే కొత్తకాదు. కెనడాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిగ్గా వారంక్రితమే లేక్ అంటారియోను లేక్ అమెరికాగా మార్చుస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అంతకుముందు అమెరికా అధ్యక్షునిగా రెండోసారి అధికారం చేపట్టిన మొదటిరోజే గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చారు. మరోవైపు ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ఎక్కువగా కాలం కొనసాగుతుందని తాను భావించడం లేదని ట్రంప్? అన్నారు.

# పోస్టర్ల వార్!

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచేందుకు సోషల్ మీడియాను వాడుకున్న గులాబీ పార్టీ శ్రేణులు.. ఇప్పుడు వీధుల్లోకి వచ్చి పోస్టర్ల దాడికి శ్రీకారం చుట్టడం విశేషం.

**కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తూ..**

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో రహదారులు, చౌరస్తాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వెలసిన వ్యంగ్యాత్మక కార్టూన్ పోస్టర్లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై వ్యంగ్యాస్త్రాలు ప్రత్యక్షం చేస్తున్నారు. ఈ పోస్టర్లలో ఎక్కడ భారత రాష్ట్ర సమితి పార్టీ పేరు కానీ.. గుర్తులు గాని ముద్రించడం లేదు. అయితే ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ సర్కార్ దిగిపోవాలన్న ఆలోచనతో ఎక్కువగా పావులు కదుపుతోంది బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు మాత్రమే. కేవలం కేసుల నుంచి తప్పించుకునేందుకు అలా చేస్తున్నారు అనేది స్పష్టం.

**ధీటుగా కాంగ్రెస్ జవాబు**

మరోవైపు ఈ తరహా ప్రచారాన్ని తిప్పి కొట్టే ప్రయత్నంలో ఉన్నాయి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. అవి సైతం అదే శైలిని ఎంచుకున్నాయి. మిర్యాలగూడ వంటి కీలక నియోజకవర్గాలతో పాటు పలు పట్టణాల్లో పదేళ్ల గులాబీ పార్టీ పాలనలో జరిగిన అక్రమాలు, కాలేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, ఆర్థిక లోటును ఎత్తిచూపుతూ ఎదురు పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. బిఆర్ఎస్ కౌంటర్ వేస్తే తాము రీకౌంటర్ వేస్తామనే తరహాలో కాంగ్రెస్ వైపు నుంచి కూడా పోటీగా పోస్టర్లు వెలుస్తున్నాయి. రెండు ప్రధాన పార్టీలు పోస్టర్ల యుద్ధాన్ని వీధుల దాకా తెచ్చినా.. తామే స్వయంగా పోస్టర్లు వేయిస్తున్నామని ఎవరు బహిరంగంగా చెప్పకపోవడం విశేషం.

**మారిన సీన్..**

తెలంగాణలో విచిత్ర రాజకీయ పరిస్థితి నెలకొంది. నిన్నటి వరకు కాంగ్రెస్ వర్సెస్ బిజెపి అన్నట్టు పరిస్థితి ఉండేది. పరస్పరం కార్యాలయాలపై దాడులు.. రంగులు పూసుకోవడం వంటివి చేసేవి. కానీ ఇప్పుడు అధికార కాంగ్రెస్ వర్సెస్ ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ అన్నట్టు పరిస్థితి మారింది. ఈ పోస్టర్ వార్ రెండు పార్టీల ముసుగులేని రాజకీయ పోరాటానికి అద్దం పడుతోంది. తమ అధికారిక ముద్ర పడకుండా పోస్టర్ల ద్వారా మైండ్ గేమ్ లు ఆడడం, ప్రజల్లో చర్చను రేకెత్తించడం ఇరు వర్గాల వ్యూహకర్తల ప్రధాన ఉద్దేశం గా కనిపిస్తోంది. ఒకరి వైఫల్యాలను మరొకరు రచ్చకెక్కించే ఈ ప్రక్రియలో పసందైన రాజకీయం నడుస్తోంది తెలంగాణలో..

# రైతు డిక్లరేషన్ నుంచి నీళ్ల దాకా..!

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ గతంలో చేసిన హెచ్చరికలు ఇప్పుడు వాస్తవ రూపం దాల్చాయని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో పొలాల వద్దకే ఎరువులు అందేవని, ప్రస్తుతం యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మిర్యాలగూడలో నిర్వహించిన రైతు ఆందోళన కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను ప్రస్తావిస్తూ.. అందులో పేర్కొన్న హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ, రైతుబంధు మొత్తాన్ని పెంచడం, మూడు పంటలకు పెట్టుబడి సాయం, కౌలు రైతులకు కూడా రైతుబంధు వర్తింపజేయడం వంటి హామీలను గుర్తుచేశారు. వరి, పత్తి పంటలకు క్వింటాల్‌పై రూ. 500 అదనపు ప్రోత్సాహకం ఇస్తామని, రూ. 2,500 మద్దతు ధర అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. 2022లో వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్



కార్యక్రమంలో ఇచ్చిన హామీలను రైతుల ధర్నా వేదికపై ప్రదర్శించినట్లు చెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ హామీలపై చేసిన వ్యాఖ్యలను కూడా కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులకు ఇబ్బందులు తప్పవని అప్పట్లో కేసీఆర్ హెచ్చరించారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యూరియా కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని ఆయన ముందే చెప్పారని పేర్కొన్నారు. రైతుబంధు విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో ఇప్పటికే పలుమార్లు రైతుబంధు సాయం నిలిచిపోయిందని, పంటల బోనస్, రుణమాఫీ విషయంలోనూ రైతులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో అమలైన రైతు సంక్షేమ పథకాలకు ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. సాగునీటి అంశాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ రేవంత్‌రెడ్డిపై మరోసారి ఆరోపణలు చేశారు. రైతులు తమ పంటలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ నేతలపై రేవంత్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావించారు. కృష్ణా జలాల వినియోగంపై కూడా కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. చంద్రబాబుకు ప్రయోజనం కలిగించే విధంగా తెలంగాణ నీటిని విడుదల చేయాలని సీఎం భావిస్తున్నారని ఆరోపించారు. మిగులు జలాల ఆధారంగా నిర్మించిన ప్రాజెక్టులకు నీటిని తరలిస్తున్నారని, పోతిరెడ్డిపాడు మార్గం ద్వారా కూడా నీటి విడుదల జరుగుతోందని ఆయన ఆరోపించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసే వరకు రైతుల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన పేర్కొన్నారు.

## భీమ్‌రెడ్డిపై ఈడీ మనీలాండరింగ్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సస్పెన్షన్‌కు గురైన డీఎస్పీ భీమ్‌రెడ్డిపై, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. అక్రమ ఆస్తులను కూడబెట్టిన కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు గతనెల 6న డీఎస్పీ భీమ్‌రెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్ట్ అనంతరం ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో కీలకమైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ. 150 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ అస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఆస్తుల కొనుగోలు తీరు, భారీ నగదు లావాదేవీలు, ఆ నిధుల మూలాలపై పక్కా ఆధారాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ బినామీ ప్రొహిబిషన్ యూనిట్ కూడా భీమ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈడీ దర్యాప్తు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, త్వరలోనే భీమ్‌రెడ్డితో పాటు ఆయన బినామీలకు కూడా ఈడీ అధికారులు విచారణ నిమిత్తం నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భీంరెడ్డి నివాసముంటున్న విల్లాను 2024లో రూ. 4.5 కోట్ల రిజిస్ట్రేషన్ వాల్యూతో కొనుగోలు చేసినప్పటికీ ఇంకా రిజిస్ట్రేషన్ పూర్తి చేయలేదని కొద్ది రోజుల క్రితం నిర్వహించిన సోదాల్లో ఏసీబీ గుర్తించింది. గచ్చిబౌలి జయభేరి పైన్ వ్యాలీలోని 3400 చదరపు అడుగుల క్రాంతి సియోన్ అపార్ట్?మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌ను బినామీ విష్ణువర్ధన్ రెడ్డి పేరుతో కొనుగోలు చేయించినట్లు ఏసీబీ గతంలో తెలిపింది. 2023లో పటాన్‌చెరు డీఎస్పీగా పని చేస్తున్న సమయంలో ముత్తంగిలో రెండు ఇళ్లు కొనుగోలు చేసి బినామీ ఇంద్రకరణ్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా తేలింది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కారు సురేశ్? అనే బినామీ పేరుతో కొనుగోలు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ గుర్తించింది. 2007లో గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని 244 గజాల ప్లాటును తన తండ్రి పేరుతో కొనుగోలు చేయించి, 2010లో గిఫ్ట్ సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి తన పేరుకు మార్చుకున్నాడు. 2012లో ఓ ఇంటిని రూ. 45 లక్షలకు కొని అదే స్థలంలో జీ-ప్లస్ 12తో పాటు పెంట్ హౌస్ నిర్మించి తన ఆధీనంలోనే ఉంచుకున్నాడు. ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు ఇప్పటికీ భీంరెడ్డి పేరుతోనే చెల్లిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది.

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు.

## సురేఖ స్వయంకృతాపరాధం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

హైదరాబాద్: మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్



శుక్రవారం
4-9-2026



**సింధుజలాలపై గొంతు చించుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదంపై ఒక్కమాటా మాట్లాడ లేదు. రాజకీయాలకు నదీజలాలను వాడుకోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ. సింధూజలాలు ఆపడం వల్ల పాక్‌లో రైతులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ సిందూ జలాలను పాక్‌కు నిలిపివేయడంపై కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. అయితే తమదేశం ఉగ్రవాదనికి మద్దతు ఇవ్వదని ఒక్కమాటా చెప్పలేదు. అయితే ఇదే సందర్భంలో మోడీ పాక్‌పై ఎదురుదాడి చేశారు. ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.**

## ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక !

ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ రకంగా షెహబాజ్‌కు ఇది ఓ హెచ్చరికల లాంటిది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై మోడీ భారత్ గళాన్ని గట్టిగా వినిపించారు. ఇది ఓ రకంగా చెప్పాలంటే హెహబాజ్‌కు సూటిగా తగిలివుంటుంది. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోడీ అన్నారు. అయితే ఇలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశానికి మోడీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్-జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మాన్ తదితరులు హాజరయ్యారు.పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాలతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.ఈ సదస్సు ద్వారా భారత్ ఎప్పటికప్పుడు ఉగ్రవాదంపై హెచ్చరిస్తూనే ఉంది. ఉగ్రవాదం ప్రపంచాన్ని తుడిచిపెట్టే మహమ్మారి అని కూడా హెచ్చరించారు. పాక్ ఇలాంటి నీతలకు లొంగి వైఖరి మార్చుకుం టుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ఉగ్రవాదులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అందువల్ల పాక్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు రాదు.

# ఆర్భాటాల నీడలో ఆత్మవంచన

**ఈ రోజు మన చుట్టూ ఉన్న సమాజాన్ని ఒకసారి నిశితంగా, ఏ కళ్ళజోడు లేకుండా నిజాయితీగా పరిశీలిస్తే ఒక విస్తుపోయే నిజం మన కళ్ళ ముందు నిలుస్తుంది. మనిషి వేసే ప్రతి అడుగు, పలికే ప్రతి మాట, చేసే ప్రతి పని వెనుక లోకం నన్ను ఎంత గొప్పగా చూస్తోంది? అనే ఒక అదృశ్యమైన ప్రశ్న అంతర్లీనంగా మెదులుతూ ఉంటోంది. దురదృష్టవశాత్తూ, ఈ ఒక్క చిన్న ప్రశ్నే ఆధునిక సమాజంలో అనేక అనర్థాలకు, మానసిక అలజడులకు మూలకారణంగా మారింది.**

నేడు సేవ అంటే ప్రచారం, నైతికత అంటే ప్రదర్శన, మనిషిత్వం అంటే కేవలం ఒక సోషల్ మీడియా పోస్ట్‌గా మారిపోయాయి. అసలైన విలువలు పూర్తిగా వెనక్కి నెట్టబడి, కేవలం బయటకు కనిపించే ప్రతిష్ట, అద్దెకు తెచ్చుకున్న కీర్తి, కొనుక్కున్న పురస్కారాల వెంట పడటం నేటి తరానికి ఒక సామాజిక అవసరంగా పరిణమించింది. అరటిపండు పండితేనే వంగుతుందనేది మన పూర్వీకుల అద్భుతమైన మాట. అంటే వ్యక్తిలో జ్ఞానం, అనుభవం పెరిగే కొద్దీ వినయం, నిగర్వం సహజంగానే పెరుగుతాయని దాని అర్థం. కానీ నేటి డిజిటల్ యుగంలో ఈ సూత్రం తలకిందులై, ఎంత తక్కువ విషయం ఉంటే అంత ఎక్కువ శబ్దం వినిపిస్తోంది. ఎంత లోతు తక్కువైతే అంత ఎక్కువ ఆర్భాటం కనిపిస్తోంది.తాము సాధించిన దానికంటే వెయ్యి రెట్లు ఎక్కువ చేసి చూపించుకోవడానికి ఎంతో మంది నిరంతరం తపిస్తున్నారు. నకిలీ ప్రశంసలు, రంగురంగుల పురస్కారాలు, ఖరీదు కట్టి కొనుక్కున్న సర్టిఫికేట్‌లను గోడలకు తగిలించుకుంటే సమాజం గౌరవిస్తుందని భ్రమిస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై లైకులు, ఫాలోవర్లను కొనుక్కుని, తానేదో అద్భుతమైన ప్రజా నాయకుడినని, మేధావినని సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకుంటున్నారు. నిజానికి నిజమైన ప్రతిష్ట నీ చేతులతో, నీ కష్టంతో నిర్మించుకోవాల్సిన శిఖరం తప్ప ఎదుటివారి చప్పట్ల కోసం, కెమెరా క్లిక్కుల కోసం వేచి ఉండే ప్రతిష్ట కాదు. అది వర్షం పడితే కరిగిపోయే మట్టి విగ్రహం లాంటిది. సులభంగా చెప్పాలంటే తమ అంతరంగంలో ఉన్న శూన్యాన్ని దాచిపెట్టి, బాహ్య ప్రపంచానికి మేకప్ వేసిన ముఖాన్ని చూపించే ప్రయత్నమే ఈ నకిలీ ప్రతిష్ట. పేరు ముందు డాక్టర్ అని తగిలించుకునే గౌరవ డాక్టరేట్ వెనుక ఎంతో కొంత విరాళం దాగి ఉంటోంది. మహాత్మా గాంధీ సేవారత్న వంటి పెద్ద పేర్లున్న పురస్కారాలు అందుకుంటున్నా, ఆ సేవ కేవలం ఫోటో షూట్‌కే పరిమితమవుతోంది. ముందుగానే ప్రెస్ నోట్లు పంపడం, వేదికల మీద తనను తాను పొగిడించుకోవడం ఒక ఫ్యాషన్‌గా మారి, ఈ కృత్రిమ ప్రయాణంలో మనిషి తన సహజత్వాన్ని కోల్పోయి ఒక క్యారికేచర్‌గా మిగిలిపోతున్నాడు.

నేటి కాలంలో పురస్కారాల ప్రదానం ఒక భారీ వాణిజ్య సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. దశాబ్ది ఉత్తమ వ్యక్తి, నారీ శిరోమణి, యువ కిశోరం వంటి బిరుదులు ఇప్పుడు సంతలో దొరికే వస్తువులయ్యాయి. కొంత సొమ్ము చెల్లిస్తే చాలు రంగుల స్టేజీ, మెరిసే షీల్డు, శాలువా కప్పే ఒక మాజీ ప్రముఖుడు అన్నీ సిద్ధమవుతున్నాయి. ఆ మరుక్షణమే ఆ ఫోటోను ఇంటర్నెట్‌లో పోస్ట్ చేసి సమాజం గుర్తించిందని గర్వంగా చెప్పుకుంటున్నారు గానీ, డబ్బు ఇచ్చి కొనుక్కున్న గుర్తింపుకు విలువ ఉంటుందా, అద్దెకు తెచ్చుకున్న కిరీటం తల మీద ఎంతసేపు నిలుస్తుందా అని ఆలోచించడం లేదు. మనస్తత్వ శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం ఇలాంటి నకిలీ ప్రతిష్టల వెంట పరుగెత్తే వ్యక్తి అంతరంగంలో తీవ్రమైన అభద్రతా భావం రాజ్యమేలుతోందని అర్థం. గుర్తింపు కోసం ఉండే ఆకలి అతన్ని ఏ గడ్డినైనా కరిపిస్తుంది. సహనం, నిబద్ధత, నిరంతర కృషి కరువై, షార్ట్ కట్ మార్గాల్లో స్టార్ అయిపోవాలనే ఆరాటమే వారిని ఈ అడ్డదారుల వైపు నడిపిస్తోంది.ఇది కేవలం వ్యక్తుల తప్పే కాదు, విజయాన్ని కొలిచే కొలబద్దలు మార్చేసి ఈ షో-ఆఫ్ సంస్కృతికి పీఠం వేస్తున్న సమాజానిదీ బాధ్యతే. ఈ పరుగు వల్ల నిశ్శబ్దంగా, నిస్వార్థంగా సేవ చేసే అసలైన మహానుభావులు వెలుగులోకి రాలేకపోతున్నారు. డబ్బు, పరపతి ఉన్న నకిలీ వ్యక్తులు పురస్కారాలను తన్నుకుపోతుంటే నిజమైన ప్రతిభావంతులు నిరాశకు గురవుతున్నారు. గుర్తింపు కోసం అడ్డదారులు తొక్కడం అలవాటైన వ్యక్తి అబద్ధాలు చెప్పడానికి, ఇతరుల శ్రమను దొంగిలించడానికి కూడా వెనుకాడడు. నేటి తరం పిల్లలు కూడా కష్టం లేకుండా వచ్చే పాపులారిటీయే జీవిత పరమావధి అని నమ్ముతున్నారు. రాజకీయాల్లోనూ, ప్రభుత్వ విభాగాల్లోనూ పని కంటే పబ్లిసిటీకే ప్రాధాన్యత పెరిగిపోవడంతో క్షేత్రస్థాయి అభివృద్ధి కుంటుపడుతోంది.

మరి నిజమైన ప్రతిష్ట అంటే ఏమిటి? మీరు ఒక గదిలో లేనప్పుడు, మీ ప్రమేయం లేకుండానే ఎవరైనా మీ పేరును తలుచుకుని చాలా మంచి వ్యక్తి అని మనస్ఫూర్తిగా అనుకుంటే అదే నిజమైన గౌరవం. అది ఫేస్‌బుక్ యాడ్స్‌తో రాదు, సంతలో దొరకదు. మీరు చేసే చిన్న చిన్న సత్కార్యాల ద్వారా, నిలబెట్టుకునే మాట ద్వారా మెల్లగా నిర్మితమవుతుంది. మన శరీరం పోయినా మనం చేసిన మంచి పనులు లోకంలో నిలిచి ఉండాలనేదే మన తెలుగు సంస్కృతి చెప్పే మాట. చెట్టుకు పండ్లు కాసినప్పుడే దాని నీడకు విలువ ఉన్నట్లు, సేవ అనే ఫలం ఉన్నప్పుడే మన పేరుకు సార్థకత ఉంటుంది. ఒక పేదవాడికి సహాయం చేసినప్పుడు కెమెరా బంధించకపోయినా ఆ వ్యక్తి కళ్ళలో కనిపించే కృతజ్ఞతే అసలైన అవార్డు. మనం డబ్బు ఇచ్చి అవార్డులు కొనే వారిని చూసి నవ్వుకోవాలే తప్ప గౌరవించకూడదు. మీడియా సంస్థలు కూడా పెయిడ్ న్యూస్‌లకు స్వస్తి చెప్పి మారుమూల గ్రామాల్లో నిశ్శబ్దంగా విప్లవాలు సృష్టిస్తున్న అజ్ఞాత మహనీయులను పరిచయం చేయాలి.




నకిలీ ప్రతిష్ట కోసం పరుగు తీయడం అనేది మొదట్లో కిక్కునిచ్చి లోలోపల మనిషిని ఖాళీ చేసే ఒక మత్తు పదార్థం లాంటిది. విశ్వనాథ సత్యనారాయణ గారు, బాపు గారు, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఎప్పుడూ పురస్కారాల కోసం పాకులాడలేదు; వారి నిబద్ధతే వారి వెంట పురస్కారాలు పడేలా చేసింది. ఆడంబరాల అద్దె కొంపలో కంటే నిజాయితీ గల చిన్న గుడిసెలో ఉండే తృప్తి వెలకట్టలేనిది. ఆ సంస్కారాన్ని పునికి పుచ్చుకుని, నిజాయితీగా మన బాధ్యతలను నిర్వహిస్తూ ఈ నకిలీ లోకం నుండి మనల్ని మనం రక్షించుకోవడమే నేటి తరానికి ఉన్న ఏకైక మార్గం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# రాజకీయ ఖైదీలకు విముక్తి ఎప్పుడు?



నేరాలు చేశారు లేదో నిర్ధారణ జరుగకుండానే వేలమంది ఏండ్ల తరబడి విచారణ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో సుమారు 6000 మంది విచారణ ఖైదీలుగా బందీలుగా నలిగిపోతున్నారు. రాజకీయ ఖైదీలపై కేసులను ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాస్వామికవాదులు, న్యాయవాదులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడిని పెంచుతున్నారు. మరోవైపు జైలులోనే దీక్షలు చేస్తూ రాజకీయ ఖైదీలు కూడా న్యాయం కోసం పోరాడుతున్నారు. రాజకీయ ఖైదీలు హక్కుల కోసం ఆందోళనబాట పడుతున్నారు. జైలు గోడల మధ్యనే నిరసనలు చేపడుతున్నారు. ముఖ్యంగా జగదల్‌పూర్, భువనేశ్వర్, రాయపూర్, సుకుమా జైళ్లలో గతంలో పలువురు ఖైదీలు దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి. మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ దాదా ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు పెట్టారు. 6000 మంది ఖైదీలను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కోరారు. దీనికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. 2026 ఆగస్టు 15న తొలి విడతలో వెయ్యి మందిని విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు ఏ ఒక్కరిని కూడా విడుదల చేయలేదు. ముఖ్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన ఆర్కే సహచరి శిరీష, బాలకృష్ణ సహచరి అనురాధ ఛత్తీస్‌గఢ్ జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జార్ఖండ్‌కు చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు అశుతోష్ రాంచీలో కేసులో ఆలస్యం చేస్తున్నారని అతని న్యాయవాది ఆరోపించారు. తెలంగాణలోని తిరుమలగిరికి చెందిన కోసపు అశోక్‌రెడ్డితోపాటు ఆయన సహచరి ఆశ మధ్యప్రదేశ్‌లోని జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఇదే అశోక్‌రెడ్డిపై జార్ఖండ్ జైలు అధికారులు విచక్షణారహితంగా దాడి చేశారు. విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లలో సుమారు 80 మంది జైలు జీవితం అనుభవిస్తున్నారు.దమావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ బ్యూరో సభ్యుడు కిషన్ జార్ఖండ్ జైలులో వృద్ధాప్యం, అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. కిషన్ సహచరి జార్ఖండ్‌కు చెందిన గీతు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. దీపక్ అనే ఖైదీ కలకత్తా జైలులో మగ్గుతున్నాడు. తమిళనాడు రాష్ట్ర కమిటీ సభ్యుడు మరో దీపక్ ఛత్తీస్‌గఢ్‌లో దవాఖానలో అరెస్టయ్యాడు. తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి. దామోదర్ భార్య రజిత ఆశన్న సహచరి శ్రీవిద్య చంచలగూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. శివారెడ్డి అలియాస్ కిరణ్ వేంగు కూడా జైలు జీవితం అనుభవిస్తున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాసి శంకర్ అలియాస్ మహేందర్ రమేశ్ ఏడేండ్లుగా భువనేశ్వర్ జైలులో విచారణ ఖైదీగా ఉన్నారు. శంకర్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తున్నది. 2017లో రామడుగు ఎన్‌కౌంటర్‌లో శంకర్ భార్య లత అలియాస్ భారతి చనిపోయారు. కందమాల్ కలహంజా నవపాడ జైళ్లలో మావోయిస్టు రాజకీయ ఖైదీలు 1000 మందికి పైగానే విచారణ ఖైదీలుగా ఉన్నారు. ముఖ్యంగా ఆదివాసీ ఖైదీల జీవితాలు జైలులోనే అర్ధాంతరంగా ముగిసిపోతున్నాయి. కోర్డులు శిక్షలు వేయకుండానే ఏండ్లకు ఏండ్లు జైళ్లలో నలిగిపోతున్నారు. సరైన వైద్యం అందక పలువురు చనిపోతున్నారు. పరివర్తన కేంద్రాలుగా ఉండాల్సిన జైళ్లు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. నయాగుడి దాడి కేసులో పోలీసులు అరెస్టు చేసిన రవి అనే ఆదివాసి, 2021లో భువనేశ్వర్ జైలులో గుండెపోటుతో చనిపోయారు. కానీ కోర్టు మాత్రం రవిని నిర్దోషిగా ప్రకటించింది. తెలంగాణకు చెందిన నిర్మల మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జైలులో 2022లో వైద్యమందక చనిపోయారు. ఇలా ఎంతోమంది విచారణ ఖైదీలు శిక్షలు పడకుండానే విచారణ ఖైదీలుగా, దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు, తుదిశ్వాస విడుస్తున్నారు. విచారణ ఖైదీలపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి.

# ప్రశాంతంగా పండగలు నిర్వహించాలి

## భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

## పోలీసులతో సమన్వయం చేసుకోవాలి.. ట్రాఫిక్, విద్యుత్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

## ఉత్సవ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొదుమూరి ప్రవీణ్ ఎన్నిక



**కోదాడ: సెప్టెంబర్ 03 క్రైమ్ మిర్రర్** పండగలు, ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు ప్రణాళికతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధాన రహదారులు, ఉత్సవ ప్రదేశాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సరఫరా విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైర్లు, లైటింగ్ ఏర్పాట్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా ఉత్సవ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. భారీగా ప్రజలు తరలివచ్చే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

**ప్రవీణ్‌కు బాధ్యతలు**

కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొదుమూరి ప్రవీణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ప్రజలందరి సహకారంతో శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అన్ని వర్గాల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కిరణ్, సీఐ శివశంకర్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, విద్యుత్ ఏడీఈ ఎం.వెంకన్న, ఎస్ఎఫ్ఓ డాక్టర్ బాబు, ఏఈ రాజిరెడ్డి, వంగవీటి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు నూన సులోచన, కనకాల వెంకటనారాయణ, కౌన్సిలర్లు చలపాటి శివ, ఎర్నేని వెంకటరత్నం బాబు, షేక్ ఖాజా ఆజాదుద్దీన్, బొలిశెట్టి కృష్ణయ్య, ముస్లిం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## ఎమ్మార్పీఎస్ నూతన మునుగోడు మండల కమిటీ ఎన్నిక

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం ఏర్పాటు చేసి నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా నందిపాటి కృష్ణ,అధికార ప్రతినిధిగా దుబ్బ రవి,ఉపాధ్యక్షులుగా పందుల వెంకన్న, లతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.సీనియర్ నాయకులు పందుల మల్లేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొమీరే స్వామి, ఇరిగి శ్రీశైలం, దుబ్బ గోపాల్,పగడాల నాగయ్య,భాస్కర్, బోయపర్తి సురేందర్,ప్రభాకర్ ,నాయకులు పాల్గొన్నారు.

## మాదాపూర్‌లో వ్యక్తి అదృశ్యం....

## ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి....



క్రైమ్ మిర్రర్ మాదాపూర్: మాదాపూర్ లో ని అయ్యప్ప సొసైటీ, దుర్గామాత గుడి వెనుక నివాసముండే నుచులోల్ల సాయిరాం యాదవ్ (31) సంవత్సరాలు అనే వ్యక్తి ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 4 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీస్తూ పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.సాయిరాం యాదవ్ ఆచూకీ తెలిసిన వారు లేదా ఎక్కడైనా కనిపిస్తే వెంటనే మాదాపూర్ పోలీస్ స్టేషన్ 87126 63109,
బంధువులు 8374742318, 9989555275 నంబర్లకు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


# ప్లాస్టిక్‌ను తరిమేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



విద్యార్థులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 03: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్లోళ్ల చంద్రశేఖర్ సూచించారు. పటాన్‌చెరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామధేను ఫౌండేషన్, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడవేయకుండా, వినియోగాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి రవీందర్ ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని తెలిపారు. అధికారి పద్మావతి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు తమ కుటుంబాలు, సమాజంలో పర్యావరణంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 600 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కామధేను ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి. వెంకటేష్, అరవింద్, పీసీబీ అధికారులు పద్మావతి, రవీందర్, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు బసవంతరావు తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్టియు పరిగి మండల శాఖ నూతన అధ్యక్షులుగా మంచనపల్లి శ్రీనివాస్ నియామకం



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా పరిగి మండల పిఆర్టియు నూతన అధ్యక్షులుగా మంచన్పల్లి శ్రీనివాసు ప్రధాన కార్యదర్శిగా మనోహర్ ను మండల శాఖ అధ్యక్షులు బుగ్గయ్య,ప్రధాన కార్యదర్శి రాకేష్ ఆధ్వర్యంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా పిఆర్టియు వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కడియాల చెంద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ పాల్గొన్నారు.పరిగి మండల ప్రధాన కార్యదర్శి వార్ల రాకేష్ రెండు విద్య సంవత్సరాలకు గాను నివేదికను సమర్పిచడం జరిగింది.ఇట్టి నివేదికను రాష్ట్ర,జిల్లా,మండల,ప్రాథమిక సభ్యుల అందరూ ఆమోదించడం జరిగింది. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పిఆర్టియు సంఘం పనిచేస్తుందని,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని,సి.పి.ఎస్ రద్దు,పి ఆర్ సి అమలు,హెల్త్ కార్డ్స్ తదితర విషయంలో జాప్యం తగదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిగిలి శ్రీపాల్ రెడ్డి ఇందిరాపార్కు దగ్గర చెప్పిన విధంగా ప్రభుత్వం వెంటనే పి.ఆర్.సిని అమలు చెయ్యాలని తెలియజేయడం జరిగింది.

**పిఆర్టియు పరిగి మండల శాఖ నూతన కమిటీ**

పరిగి మండల శాఖ అధ్యక్షులుగా మంచనపల్లి శ్రీనివాస్,గౌరవ అధ్యక్షులుగా యం.డి.ఉస్మాన్ అలీ ప్రధాన కార్యదర్శిగా డి. మనోహర్,అసోసియేట్ అధ్యక్షులుగా సుధాకర్,తస్లీమా,సంధ్య రాణి, ఉపాధ్యక్షులుగా మహేందర్, రాకేష్,కార్యదర్శులు రమేష్,మహేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మంచన్పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ రాష్ట్ర,జిల్లా కమిటీల ఆదేశాలు పాటిస్తూ సంఘ నిర్మాణంలో ముందు ఉంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిగి మండల విద్యాధికారి అంజయ్య,బొంరస్ పేట్ మండల విద్యాధికారి జీహెచ్ఎంల జిల్లా అధ్యక్షులు హరిలాల్,జిహె చ్ఎంలు శుభాస్,వెంకటేశం,లాల్యా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామాంజనేయులు,వెంక టయ్య,గోపాల్,రాష్ట్ర కార్యదర్శులు,బాల్ రాజు, ప్రకాష్,రాజశేఖర్ రెడ్డి,నిరంజన్ రెడ్డి,జిల్లా నాయకులు అదిశంకర్,తావుర్య,రాజేష్ రాథోడ్ ,ఇబ్రహీం,ప్రభాకర్ రెడ్డి,సాయిలు,జైపాల్ రెడ్డి,శ్రీకాంత్,శీనయ్య,భీమయ్య,నర్సిములు,శ్రీనివాస్ ,మండల అసోసియేట్ అధ్యక్షులు వెంకట్ ప్రసాద్,ప్రాథమిక సభ్యులు పూడూర్ మండల అధ్యక్షులు అంజయ్య,ప్రధాన కార్యదర్శి ముకుంద రెడ్డి,దోమ మండల పి ఆర్ టి యు అధ్యక్షులు కేశవులు,కుల్కచర్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బస్వరాజు,బొంరస్ పేట్ అధ్యక్షులు అనిల్,ప్రధాన కార్యదర్శి శశి,వికారాబాద్ మండల అధ్యక్షులు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,వివిధ మండలాల రాష్ట్ర,జిల్లా,మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చిన్ని కృష్ణయ్యల గోపికలతో కలకల్లాడిన శ్రీ చాణిక్య పాఠశాల





**కోదాడ, సెప్టెంబర్ 03(క్రైమ్ మిర్రర్):** కోదాడ పట్టణంలోని శ్రీ చాణిక్య పాఠశాలలో ముందస్తుగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి బాల్య ఘట్టాలను ప్రతిబింబించేలా విద్యార్థుల వేషధారణ, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రీకృష్ణుడి బోధనలు, సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో 61 వేలకు పైగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ....



**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి , ఏఎస్ఓ పుల్లయ్య , తాజా మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, నార్నె శ్రీనివాస రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడు తూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని కొనియాడారు. ఒకప్పుడు ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైన సన్న బియ్యాన్ని పేదవాడి కంచంలో ముద్దగా అందించిన గొప్ప దార్శనికుడు సీఎం రేవంత్ రెడ్డి అని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కు శేరిలింగంపల్లి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 61,482 రేషన్ కార్డులు పంపిణీ చేశామని, రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తామన్నారు. క్యూఆర్ కోడ్ తో కూడిన ఈ స్మార్ట్ కార్డులు మరింత పారదర్శకంగా, సులభంగా తీసుకెళ్లే విధంగా రూపొందించారన్నారు.పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రేషన్ షాపులను కూడా పెంచాలని కోరారు. అర్హులైన వారు మీ-సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ యువతకు గ్లోబల్ నైపుణ్యాలే లక్ష్యం.. జపాన్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం

**మంచిర్యాల సెప్టెంబర్ 3 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ యువతకు అంతర్జాతీయ నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా చేపట్టిన జపాన్ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగొచ్చిన రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జపాన్‌లోని ఆధునిక సాంకేతిక శిక్షణా విధానాలను తెలంగాణలో అమలు చేయడం ద్వారా మన యువతకు గ్లోబల్ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, పనాస రాజు, గోపతి బానేష్, గోపు రాజం, బత్తుల వేణు నాయకులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం.. బీఆర్ఎస్ పోరుబాట

జీవో 97ను రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

100 రోజులన్నారు.. 1000 రోజులు గడిచినా హామీలు ఎక్కడ?

420 హామీలు.. అమలులో మాత్రం జీరో! కాంగ్రెస్‌పై ఆదర్శ్ రెడ్డి ఫైర్

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

హామీలు అమలు చేసే వరకు పోరుబాట ఆగదు: ఆదర్శ్ రెడ్డి

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి!

స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో.. ఉద్యోగాల కోసం యువత ఎదురుచూపులు!

జాబ్ క్యాలెండర్ ఎక్కడ? యూత్ డిక్లరేషన్ ఏమైంది?





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 03: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి విమర్శించారు. విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టిన 'కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట' లో భాగంగా రెండో రోజు పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి గ్రౌండ్స్‌లో విద్యార్థులతో కలిసి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, కాలేజీ విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు యువతకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకుండా పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగాబిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. "100 రోజులన్నారు.. 1000 రోజులు గడిచినా హామీలు ఎక్కడ?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన ఏడు రోజుల పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి, యువజన నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు:డా. శివప్రసాద్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలను తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చినుకని శివప్రసాద్ తెలిపారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు, భగవద్గీత సందేశం నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కష్టాలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ముందుకు సాగుతూ, ధర్మం వైపు నిలబడాలనే సందేశాన్ని శ్రీకృష్ణుడు అందించారని తెలిపారు. ముఖ్యంగా యువత భగవద్గీతలోని కర్మయోగం, కర్తవ్యబోధలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని, పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని కోరారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని డాక్టర్ చినుకని శివప్రసాద్ ఆకాంక్షించారు.

## గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణే లక్ష్యం: కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 03:** గ్రామీణ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా అవసరమైన నైపుణ్య శిక్షణలను గుర్తించి, వివిధ శాఖలు ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐతో సమన్వయంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. శిక్షణలకు అర్హులైన యువతీ యువకులను గుర్తించి, వారికి తగిన కోర్సుల్లో శిక్షణ అందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాల్లో పునరావృతం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, జిల్లా నైపుణ్య అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆర్‌ఎస్‌ఈటీఐ వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వయస్సు వారికి సుమారు 70 రకాల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు.సమావేశంలో డీఆర్‌డీఓ జ్యోతి, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, ఎల్‌డీఎం సుధీర్ కుమార్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న

### మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

### మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**యాదాద్రి భువనగిరి జిల్లా బుర్యో, క్రైమ్ మిర్రర్:-** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడిపల్లి ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమం శ్రీ ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి చైర్మన్ రావుల స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు కేతరాజు గోపాల్, గౌరవ అధ్యక్షులు కేతరాజు అచ్చయ్య, చామకూర రాజయ్య,రావుల ముత్యాలు,కేతరాజు రామదాసు, కేతరాజు నరసింహా, చామకూర యాదయ్య,కేతరాజు గోపాలు, కేతరాజు మల్లేష్, రజక సంఘ సభ్యులు, రజక కుల బంధువులు తదితరులు హాజరయ్యారు.



# ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం




### పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

### కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనకు వ్యతిరేకంగా కుల్కచర్ల మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆరోపించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ వైఫల్యాలను వారు చేస్తున్న ప్రజా వ్యతిరేక పరిపాలనను ఎండగడుతూ గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి కుల్కచర్ల గ్రామం చిన్న గేటు నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా వరకు బారి నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి అడ్డగోలిగా హామీలు ఇచ్చారని వాటిని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను రైతులను మోసం చేశారని మహేష్ రెడ్డి మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో చేసిన అభివృద్ధి తప్ప చేసిందేమీ లేదని, పరిగి నియోజకవర్గంలోని అన్ని మండలాలలో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత రోడ్లపై గంపెడు మట్టి కూడా వేయలేదని, కుల్కచర్ల మండల కేంద్రం నుంచి చౌడపూర్ వరకు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే డబల్ రోడ్డు వేయించామని, చౌడపూర్ నుంచి మరికల్ నవాబుపేట్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారి ఎన్నో రోడ్డు ప్రమాదాలకు ప్రజలు గురవుతున్నారని వారు ఎద్దేవ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కోడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారే తప్ప మిగతా నియోజకవర్గాలు పరిగి వికారాబాద్ అభివృద్ధిని గాలికి వదిలేసారని వారు దుయ్యబట్టారు.

**పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పట్టించుకోని కాంగ్రెస్**

బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు సాగు తాగునీరు గురించి ఆలోచన చేసి మిషన్ భగీరథ మిషన్ కాకతీయ పథకాలను తీసుకువచ్చి రైతుల కళ్ళల్లో ఆనందం నింపారని వారు గుర్తు చేశారు. రైతులకు 24 గంటల కరెంటును ఇచ్చి రైతును రాజుగా చేసిందని వారు అన్నారు. రైతులకు రైతుబంధు రైతు భీమా ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు కేసీఆర్ చేశారని వారు గుర్తు చేశారు.కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వము అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నీరుగార్చి సీఎం రేవంత్ రెడ్డి కోడంగల్ నియోజకవర్గానికి నారాయణపేట ఎత్తిపోతల ప్రాజెక్టును మొదలుపెట్టాడని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను రద్దు చేశారని వారు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాటలు తప్ప పరిగి నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని, అధికారంలోనికి వచ్చి వెయ్యి రోజులు అయినా కూడా పరిగి నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు తప్ప చేసిందేమీ లేదని అభివృద్ధిని చేసి చూపించి మాట్లాడాలని వారు ఎమ్మెల్యేకు సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ కుమార్ రెడ్డి, పరిగి మాజీ జెడ్పీటిసి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్, పరిగి కౌన్సిలర్ రవికుమార్, బిఆర్ఎస్ పార్టీ పరిగి పట్టణ సీనియర్ నాయకులు మీరు మహమ్మద్ చౌడపూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రైతుబంధు కుల్కచర్ల మండల మాజీ అధ్యక్షులు కేబీ రాజు, బిఆర్ఎస్ పార్టీ కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శి గజ్జి లక్ష్మయ్య, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ గందె రాజయ్య, టిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గుండుమల్ల నర్సింలు, మాలే.కృష్ణయ్య, టిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు సునందబుగ్గన్న, మాజీ అధ్యక్షులు సారా శ్రీనివాస్, యువ నాయకులు మేఘ్య నాయక్, రాజశేఖర్,పరిగి అశోక్, కుల్కచర్ల గ్రామ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భోగం శ్రీశైలం, సీనియర్ నాయకులు నాగని బుచ్చయ్య, బాలకృష్ణ, కుల్కచర్ల మండలం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు చౌడపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## చెల్లాపూర్ పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలతో అలంకరించడం జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించడం జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సంతోషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్, ఉపాధ్యాయులు దస్తయ్య, స్కావెంజర్ బాలయ్య,చందు, విద్యార్థుల తల్లిదండ్రులు తిరుపతమ్మ, అంజిలమ్మ, గున్నమ్మ,సత్యమ్మ, లక్ష్మణరావు, లక్ష్మమ్మ విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## తల్లి చల్లని చూపులు ప్రజలపై ఉంటేనే సుభిక్షం..

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

కేశంపేట,(క్రైమ్ మిర్రర్):గ్రామదేవతులైన పోచమ్మ,ఈదమ్మా, మైసమ్మ ఎల్లమ్మ,భావనమ్మ అమ్మవారుల చల్లని చూపులు ప్రజలపైనే ఉంటేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. గురువారం మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనం ఎత్తి భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం, అమ్మవారి దీవెనలతోనే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు.అమ్మవార్ల కరుణ కటాక్షం గ్రామ ప్రజలందరికీ పై ఉండి ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పల్లెముని సువర్ణ చిన్న నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఉపసర్పంచ్ కాత్రావత్ రమేష్, మాజీ సర్పంచ్ మంజుల మల్లేష్, చిర్ర శీను, ఆనంద్ రెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# మంథనిలో కాంగ్రెస్ పాలనపై 'బీఆర్ఎస్ పోరుబాట'

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ఫైర్**

**పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పాలనపై నిరసన**

**కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నల వర్షం**

**హామీల లెక్కలు తేల్చాల్సిందే : పుట్ట మధుకర్**

**హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం : బీఆర్ఎస్ శ్రేణులు**




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాలు మంథని నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

**హామీలు అమలు చేయకుండా కాలయాపన**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలను ప్రజలకు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని 100 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రకటించిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అయితే 1,000 రోజుల పాలన పూర్తయినా హామీల్లో అనేకం పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు, యువత, మహిళల సమస్యలపై ప్రశ్నలు రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతులకు సంబంధించిన పథకాలు, రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీలు తదితర అంశాల్లో ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**మంథని అభివృద్ధిపై పుట్ట మధుకర్ విమర్శలు**

మంథని నియోజకవర్గంలో కూడా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు.

**ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన నష్టాలను, ప్రభుత్వం అమలు చేయని హామీలను గ్రామగ్రామాన ప్రజలకు వివరిస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి హామీల అమలుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



## రవిదాస్ చిత్రపటంపై ఇంకు చల్లడాన్ని ఖండించిన మాస శ్రీనివాస్

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై నల్ల ఇంకు చల్లడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా, సమగ్ర మోచి సంఘం ఆధ్వర్యంలో చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కనకదుర్గ సెంటర్‌లో సంత్ రవిదాస్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంత్ రవిదాస్ రాష్ట్ర కన్వీనర్ మాస శ్రీనివాస్, డా. రుద్రవరం లింగస్వామి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, సుంచు శ్రీను, చికలం మెట్ల అశోక్, కూరెళ్ల శ్రీనివాస్, జయారపు రామకృష్ణ, కంచర్ల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు







హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 03: హైదరాబాద్ మాజీ మేయర్, ముదిరాజ్ ముద్దుబిడ్డ స్వర్గీయ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి వేడుకలను హత్నూర మండల ముదిరాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దౌల్తాబాద్ కసాల చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం ఎస్ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ముదిరాజ్ బంధువులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ముదిరాజ్ సంఘాల పెద్దలు చొరవ తీసుకుని బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

## నేడు మాంసం దుకాణాలు బందు పాటించాలి

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నేడు నగరంలోని గొర్రెలు, మేకల విక్రయ దుకాణాలు, వధశాలలు బందు పాటించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి రహస్యంగా మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అర్హతలు లేకుండా వైద్యం.. ఏడు ప్రైవేట్ దవాఖానలకు సీజ్

**హత్నూర మండలంలో ఆరోగ్యశాఖ ఆకస్మిక తనిఖీలు..**

**నిబంధనలు ఉల్లంఘించిన క్లినిక్‌లపై చర్యలు**




హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 03: అర్హతలు, అనుమతులు లేకుండా ప్రైవేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న సమాచారంతో హత్నూర మండలంలో ఆరోగ్యశాఖ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఏడు ప్రైవేట్ దవాఖానలు, వాటికి సంబంధించిన మెడికల్ షాపులను సీజ్ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో క్లినిక్‌ల నిర్వహణకు అవసరమైన అర్హతలు, అనుమతులు, వైద్య సేవలకు సంబంధించిన రికార్డులు, ఇతర నిబంధనలను అధికారులు పరిశీలించారు. కొన్ని క్లినిక్‌లలో అర్హతలు లేకున్నా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆయా దవాఖానలపై చర్యలు తీసుకుని సీజ్ చేసినట్లు డీఐఓ శశాంక్ దేశ్‌పాండే వెల్లడించారు. ఈ సందర్భంగా డీఐఓ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైద్య అర్హతలు, ప్రభుత్వ అనుమతులు లేకుండా క్లినిక్‌లు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందించడం చట్టవిరుద్ధమని తెలిపారు. ప్రజలు కూడా వైద్యం కోసం అర్హత కలిగిన వైద్యులను, అనుమతులు ఉన్న ఆసుపత్రులను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. మండలంలో ప్రైవేట్ వైద్య కేంద్రాలపై తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. తనిఖీల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది వైద్యులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. హత్నూర మండలంలో మొత్తం 3 దవాఖానలు, 3 క్లినిక్‌లు, ఒక డయాగ్నస్టిక్ సెంటర్ సహా పలు ప్రైవేట్ వైద్య కేంద్రాలను అధికారులు తనిఖీ చేసినట్లు సమాచారం. నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతోందా లేదా అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు.




## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 03:** భద్రాచలం పట్టణం చర్ల రోడ్డు లో గల శ్రీ చైతన్య పాఠశాలలో ప్రిన్సిపల్ బి. గోపాల్ ఆధ్వర్యంలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పుస్తక విద్యతో పాటు విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడం కూడా విద్యలో భాగమేనని ప్రిన్సిపాల్ బి. గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి చిత్రపటానికి, ఉట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టి కేరింతలు కొడుతూ సందడి చేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చిన్నారులకు పరిచయం చేయవచ్చన్నారు. శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం, కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ వెంకట కృష్ణ, ప్రైమరీ ఇంచార్జ్ స్వర్ణలత, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్వేతాంజలి, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వర్షాకాలంలో వేసిన పంటలను రైతులు నమోదు చేసుకోవాలి

**కుల్కచర్ల మండల ఏఈఓ భావన**

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: ఈ ఏడాది వర్షాకాలంలో వేసిన పంటలను రైతులు తప్పకుండా నమోదు చేసుకోవాలని కుల్కచర్ల మండలం ఏఈఓ భావన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల్కచర్ల మండలంలోని అన్ని గ్రామాలలో పంట నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం ధాన్యాం కొనుగోలు చేస్తుందని లేనియెడల ప్రభుత్వం కొనుగోలు చేయదని వారు తెలిపారు. అందుకే రైతులు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పంట నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

## క్షయ రహిత సమాజమే లక్ష్యం

**సంగమల్లయ్య పల్లి లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్**

**135 మందికి టీబీ ఎక్స్-రే పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ**



**మంచిర్యాల సెప్టెంబర్ 3 (క్రైమ్ మిర్రర్) :** క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ప్రధాన లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ స్పష్టం చేశారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంగ మల్లయ్య పల్లి వార్డులో గురువారం ప్రత్యేక క్షయ వ్యాధి నిర్ధారణ, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉప డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్, స్థానిక కార్పొరేటర్ సుధాకర్, వైద్యాధికారి వెంకటేష్‌లతో కలిసి డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డిజిటల్ మొబైల్ ఎక్స్-రే వాహనం ద్వారా 135 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. రెండు వారాలకు పైగా తెమడతో కూడిన దగ్గు, రాత్రి పూట జ్వరం, చెమటలు పట్టడం, ఆకలి మందగించి బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. సరైన సమయంలో గుర్తిస్తే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు.

**నెలకు రూ.1,000 ఆర్థిక సాయం:** జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం మూడు మొబైల్ ఎక్స్-రే యంత్రాల ద్వారా శిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో తెలిపారు. బాధితులకు వ్యాధి తగ్గే వరకు నెలకు రూ. 1,000 చొప్పున పోషకాహార భత్యం అందిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రోగులకు పోషకాహార కిట్లు అందజేయాలని కోరారు. "టీబీ ఓడుతుంది - దేశం గెలుస్తుంది" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, టీబీ విభాగం కోఆర్డినేటర్ సురేందర్, సురేందర్ సాయిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## కలివేరు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఎంపీఓ..

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 03:** చర్ల మండల పరిధిలోని కలివేరు గ్రామపంచాయతీని చర్ల మండల ఎంపీఓ సూర్య నారాయణమూర్తి గురువారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయం రికార్డ్స్, పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పనులు, పారిశుద్ధ్యం ప్రజల వినతులు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు ప్రణాళికలపై సర్పంచ్ లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ మూర్తికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శుక్రవారం 4-9-2026

# బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన ధర్నా అస్యస్పదంగా ఉంది

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ పిఏసిఎస్ చైర్మన్ భీంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు**



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** కుల్కచర్ల మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన నిరసన ర్యాలీ ధర్నా ఆస్యస్పదంగా ఉందని, 10 సంవత్సరాల అధికారాన్ని పోగొట్టుకున్నంది జీర్ణించుకోలేక ప్రజలను రైతులను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ధర్నాలు నిరసనలు చేస్తున్నారని కుల్కచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్, పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ఖండించారు. వారు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ మా నాయకులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పరిగి నియోజకవర్గం అభివృద్ధి చేస్తా ఉంటే బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి జీనించుకోలేకపోతున్నారని వారు ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు 6 గ్యారంటీలను అమలు చేస్తుందని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు కొత్త రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, పదేళ్ల బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, వారు ఎద్దేవ చేశారు. ప్రతి పేదవాడికి డబ్బులు బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని మీ నాయకుడు కేసీఆర్ మోసం చేయలేదా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితుడుని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేయలేదా, పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకుని దాచుకొని అప్పుల కుప్పగా మార్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేయలేదా అని వారు విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి అప్పుల్లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ, ప్రతి పేదవారికి ఇల్లు లేని వారికి,ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తా ఉంటే చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మతిస్థిమితం కోల్పోతున్నారని, అందుకే ఏ విధంగానైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బద్నాం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న ధర్నాలకు నిరసనలకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పెంటమీది వెంకటయ్య, కుల్కచర్ల మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య మాజీ ఎంపిటిసి షర్మిల ఆనంద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తమ్మలి రామచంద్రయ్య, సర్పంచులు గడ్డం వెంకటయ్య, ఎర్రం పోటి మల్లేష్, చెక్కల తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హరినాథ్ రెడ్డి, ఐలగారి కృష్ణయ్య, ల్యాగల. లాలు, వడ్డె రాములు,వార్డు సభ్యులు మోత్కూరు వెంకటేష్ కర్రె వినోద్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## దీప్తిశ్రీనగర్‌లో సర్కారీ శిఖం భూమి కబ్జా....

### తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర రెడ్డి డిమాండ్....

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం దీప్తిశ్రీనగర్ లోని సర్వే నెంబర్ 151 ప్రభుత్వ శిఖం (చెరువు) భూమిని, సర్వే నెంబర్ 150 పట్టా భూమిగా చూపించి దీప్తిశ్రీనగర్ హౌసింగ్ సొసైటీ రిజిస్ట్రేషన్లు చేసి కోట్ల రూపాయలు దండుకుందని, దానిపై బిల్డర్ పవన్ కుమార్ అక్రమ నిర్మాణం చేపట్టారని 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి కి ఫిర్యాదు లేఖ సమర్పించారు.

**ఫిర్యాదులోని ముఖ్యాంశాలు:**

- సర్వే నెం. 151 సర్కారీ శిఖం భూమిని, 30 ఏళ్ల క్రితం లేఅవుట్ చేసిన సర్వే నెం. 150 గా చూపి సొసైటీ రిజిస్ట్రేషన్లు చేసింది.
- 2020లోనే ఆర్డీఓ చంద్రకళ గారు సర్వే చేయించి ఇది సర్వే నెం. 151 చెరువు భూమి అని తేల్చారని, అయినా 2023లో జీఎచ్ఎంసీ అనుమతితో నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు.
- WP No. 4217 శీట 2026 పై హైకోర్టు సర్వే చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, గిర్దావర్ సర్వేలో 372.5 గజాలు పూర్తిగా చెరువు శిఖం భూమిగా తేలిందని పేర్కొన్నారు.
- అయితే కబ్జాదారు తహసీల్దార్ సర్వేపై నమ్మకం లేదని ఏడీ సర్వేకు దరఖాస్తు చేసుకుని, తనకు అనుకూలంగా రిపోర్టు తెచ్చుకున్నారని, ఈ విషయంపై 20-07-2026న కలెక్టర్, రంగారెడ్డి ఏడీకి ఫిర్యాదు చేశామన్నారు. ఏడీ కార్యాలయం జూలై 2026లో లేఖ ద్వారా తమ సర్వే నిబంధనల ప్రకారం జరగలేదని తహసీల్దార్ కు తెలిపిందని తెలిపారు.
- తహసీల్దార్ కార్యాలయం బ్యానర్ కట్టినా కబ్జాదారు తొలగించారని, ఇప్పుడు సర్వే నోటీసు ఇవ్వలేదంటూ హైకోర్టు నుండి స్టేటస్ కో తెచ్చుకున్నారని, ఇది తహసీల్దార్ కార్యాలయ వైఫల్యమేనని ఆరోపించారు.
- స్టేటస్ కో కేవలం నిర్మాణానికి మాత్రమే వర్తిస్తుందని, అక్రమంగా ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసిన దీప్తిశ్రీనగర్ సొసైటీ మరియు బిల్డర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, లేనిపక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని 'జనం కోసం' సంస్థ హెచ్చరించింది.

## మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత పటిష్ట చర్యలు: స్పీ రోహిత్ రాజు.

### జిల్లా మహిళా భద్రతా విభాగం ఏర్పాటు



**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 03:** తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా మహిళా భద్రతా విభాగంను నూతనంగా ఏర్పాటు చేసారు..మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, కేసుల దర్యాప్తు మరియు పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, పునరావాసం తదితర కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం జిల్లా మహిళా భద్రతా విభాగం ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా మహిళా భద్రతా విభాగం సభ్యులతో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, బాధితులకు అండగా నిలవాలని సూచించారు.జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న మహిళా భద్రతా బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా పోలీస్ స్టేషన్, కౌన్సెలింగ్ కేంద్రాలు తదితర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు.మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణతో పాటు, నమోదైన కేసుల దర్యాప్తు మరియు పర్యవేక్షణలో నాణ్యతను పెంచాలని, బాధితులకు అవసరమైన చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్ మరియు ఇతర సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, ఏఎస్ఐ కస్తూరి, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను విద్యార్థులు, టీచర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలరించారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టడం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఎస్.రమణ, బత్తుల రేణుక,రఫియా,రహీమ,అనిత, ఆయాలు బత్తుల వెంకట మల్లమ్మ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## శేరిలింగంపల్లి జోన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక...



**క్రైమ్ మిర్రర్ ?చందానగర్:** శేరిలింగంపల్లి జోన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చందానగర్ ఫంక్షన్ హాల్‌నందు నిర్వహించిన కాంట్రాక్టర్ల సమావేశంలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వరికుప్పల రాములు, అధ్యక్షుడిగా జి . జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రయ్య యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.?ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వరికుప్పల రాములు మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాంట్రాక్టర్ సోదరులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు.?ఈ సమావేశానికి విచ్చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసిన నాయకులకు, శేరిలింగంపల్లి జోన్ కాంట్రాక్టర్ సోదరులతో పాటు ప్రత్యేకంగా విచ్చేసిన కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్ల కాంట్రాక్టర్లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారంతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

## విద్యాశాఖ మంత్రి పదవి కసిరెడ్డి కి ఇవ్వాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు

**అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్న నాయకులు, కార్యకర్తలు**

**విద్యారంగంతో అనుబంధం, ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం ఉందని ప్రస్తావన..**



**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో విద్యాశాఖ బాధ్యతలు అప్పగించాలని నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నట్లు సమాచారం. ఈ అంశంపై కల్వకుర్తి కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కసిరెడ్డి నారాయణ రెడ్డి గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం ఉందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. విద్యారంగంతో ఉన్న అనుబంధం, ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విద్యాశాఖ బాధ్యతలు అప్పగించాలని వారు కోరుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవుల కేటాయింపుపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, కసిరెడ్డికి విద్యాశాఖ కేటాయించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ చరిత్రలో కల్వకుర్తికి ప్రత్యేక స్థానం**

కల్వకుర్తి నియోజకవర్గానికి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక చరిత్ర ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రం లో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు కల్వకుర్తి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన విషయం రాజకీయ చరిత్రలో ప్రస్తావించబడుతుంది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కల్వకుర్తికి ప్రత్యేక గుర్తింపు ఏర్పడిందని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కసిరెడ్డి నారాయణ రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ శ్రేణులు అధిష్టానాన్ని కోరుతున్నాయి. అయితే మంత్రి పదవి కేటాయింపుపై తుది నిర్ణయం పార్టీ అధిష్టానానిదే కానుంది.

## నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య



గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస హత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రాంతంలో వరుసగా చోటుచేసుకుంటున్న దారుణ ఘటనలతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఓ వ్యక్తి హత్యకు గురైన ఘటన మరువకముందే... 12 గంటల వ్యవధిలోనే రాత్రి మరొక యువకుడు దారుణంగా హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని దుండగులు కత్తులు, కర్రలతో సదరు యువకుడిపై నడిరోడ్డుపైనే విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడిని అబ్దుల్ రౌఫ్‌గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, హత్యకు గల కారణాలు మరియు నిందితుల వివరాలను తెలుసుకునేందుకు తీవ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.




## అక్రమంగా తరలిస్తున్న నల్లివేర్లు వాహనాన్ని పట్టు కున్న ఫారెస్ట్ అధికారులు...

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 3 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కుదునూరు గ్రామ సమీపంలో అక్ర మంగా నల్లివేర్లు, దుంపలను తరలిస్తున్న వాహనాన్ని ఫారెస్ట్ సిబ్బందికి పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాన్ని ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాజేష్, బేస్ క్యాంప్ సిబ్బంది చర్ల రేంజర్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. నల్లి వేర్లు వాహనంలో అక్రమ గా తరలిస్తు పట్టు బడిందనే విషయంపై ఫారెస్ట్ అధికారులు వివరణ కోరగా అటవీ ప్రాంతం నుండి అక్ర మంగా నల్లివేర్లు వేళ్ళు, దుంపలను తరలిస్తున్నట్లు ఫారెస్ట్ సిబ్బందికి అందిన ముందస్తు సమాచారం మేరకు కుదునూరు సమీప ప్రాంతంలో పట్టుకున్నట్లు తెలిపారు. నల్లి వేర్లు దుంపలు ఔష ధలు కలిగి ఉన్నా యని, ఇవి ఎన్నో రకాల దీర్ఘ వ్యాధులకు పనిచే స్తాయని ఆయుర్వేదిక్ మందులకు ఉపయోగిస్తారని, వీటితో తయారు చేసిన ఆయుర్వేదిక మందులకు లక్షలాది రూపాయలలో ఆదాయం ఉంటుందనే తెలిపారు. అటవీ ప్రాంతం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అటవీ ఉత్పత్తులను తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ సెక్షన్ అధికారులు హెచ్చరించారు.

## పలివెల ఈవీఎం పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ





**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల పరిధిలోని పలివెల ఈవీఎం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం వైభవంగా, కోలాహలంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ నాతి సైదులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చిన్ని కృష్ణుడి లీలలు,ఆయన అందించిన భగవద్గీత బోధనలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధమ్మల వేషధారణలతో అలరించారు.పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.కృష్ణాష్టమి విశిష్టతను చాటుతూ విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు, గేయాలాపనలు అందరినీ ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 22-ఎ నిషేధిత జాబితా నుంచి పేదల భూములు ఖాళీ స్థలాలు, ప్లాట్లు, ఇండ్లను వెంటనే తొలగించాలి

- ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు.. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటిలోనూ వైఫల్యాలే- పట్లోళ్ల కార్తీక్ రెడ్డి
- బాధిత ప్రజలకు అండగా హిమాయత్ సాగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నిరసన ధర్నా



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడమే కాకుండా, ఇప్పుడు పేదలు, మధ్యతరగతి ప్రజల భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, నివాస గృహాలను 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చి వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా, 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, ఇండ్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ హిమాయత్ సాగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కష్టపడి సంపాదించిన డబ్బుతో పేదలు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసుకున్న భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, ఇండ్లను 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని అన్నారు. ప్రజల కష్టార్జిత ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం అదే ప్రజల ఆస్తులపై ఆంక్షలు విధిస్తోంది. ఒక సామాన్య కుటుంబం జీవితకాలం కష్టపడి సంపాదించిన డబ్బుతో ఒక చిన్న స్థలం కొనుగోలు చేసుకుంటుంది. మరొక కుటుంబం అదే స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుంది. అలాంటి ఆస్తులను 22-ఎ జాబితాలో చేర్చడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇది పేద, మధ్యతరగతి ప్రజలపై జరుగుతున్న అన్యాయం అని కార్తీక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలు ఎక్కడ? 420 హామీల పరిస్థితి ఏమిటి? వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోంది. ఇప్పుడు ప్రజలు తమ సొంత భూములు, ప్లాట్లు, ఇండ్ల విషయంలో కూడా ఆందోళన చెందాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది అని ఆయన విమర్శించారు. 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చిన భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, నివాస గృహాలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర పరిశీలన జరిపి, అర్హమైన ఆస్తులను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వి. రాముడు యాదవ్ మాట్లాడుతూ, 22-ఎ నిషేధిత జాబితా కారణంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజలు తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెట్టి భూములు, ప్లాట్లు కొనుగోలు చేసుకున్నారు. కొందరు అదే స్థలాల్లో నివాస గృహాలు నిర్మించుకున్నారు. ఇప్పుడు వాటిని 22-ఎ నిషేధిత జాబితాలో చేర్చడంతో తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోలేక, అవసరమైన సమయంలో విక్రయించుకోలేక ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రజలకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం వారి ఆస్తుల విషయంలోనే అనిశ్చితిని సృష్టించడం సరికాదు అని వారు అన్నారు. 22-ఎ జాబితాలో చేర్చిన ప్రతి భూమిని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఎలాంటి వివాదాలు లేని, అర్హత కలిగిన భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, నివాస గృహాలను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. ప్రజల కష్టార్జిత ఆస్తులపై హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో విఫలమైందని, వెయ్యి రోజుల పాలనలో ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఉపాధ్యక్షులు నర్సనోళ్ల వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవికుమార్, కోశాధికారి శాంతి కుమార్, పెంటయ్య యాదవ్, మహిళా అధ్యక్షురాలు శాంతి నాయక్, ఉపాధ్యక్షురాలు మల్లీశ్వరి, సుధాకర్ గౌడ్, నవీన్ ముదిరాజ్,సంతోష్ గౌడ్, ఉదయ్ గౌడ్, చంద్రావు, ఇంతియాజ్, ఇస్మాయిల్, శ్యాముల్, నవీన్, చంద్రశేఖర్, ప్రసాద్, ఫక్రుద్దీన్, రాజేష్, నాగరాజు, రాజ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, పప్పీ సుధాకర్, చంద్రశేఖర్,అశ్విన్ కుమార్, సంతోష్, సాయి రెడ్డి, యాదగిరి, ఏ వెంకటేష్, సయ్యద్ అప్రోచ్, రాజ్ కుమార్, మాలిక్,దామోదర్, పరశు రాం, యాదగిరి, పెంటయ్య, టిల్లు, చంద్రశేఖర్, గణేష్, నాగరాజు, దినేష్, శ్రీధర్, నాగేందర్, బాబు, ఓం ఆదిత్య, చందు, సాయి, నటరాజ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాజేంద్రనగర్‌లో ఓపిఎస్, సిపిఎస్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పరిధిలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఓపిఎస్, సిపిఎస్ ఉద్యోగులు, నాన్-టీచింగ్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, భవిష్యత్ ప్రయోజనాల సాధన కోసం ఉద్యోగులు ఐక్యంగా నిలిచి తమ సంఘీభావాన్ని చాటారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నాన్-టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పొత్తురాజు యాదయ్య, ఉపాధ్యక్షులు కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దీపారాణి, జాయింట్ సెక్రటరీ అనిల్ రెడ్డితో పాటు విజయ్, హరికృష్ణ, శ్రీహర్ష, భావిత, హరిత, ఉదయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉద...

## అరుణోదయ కాలనీలో సిసి రోడ్డు పనుల ప్రారంభం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కిస్మత్‌పూర్ 122వ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నాయకులు, అధికారులు కలిసి ఈ పనులను శంకుస్థాపన చేసి పనులను మొదలుపెట్టించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరుణోదయ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టమైన సూచనలు చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోకరి సురేష్ గౌడ్, బుర్ర రవీందర్ ప్రసాద్ యాదవ్, నరసింహా గౌడ్, మాచన్ పల్లి సాయి గౌడ్, శివ, వెలుగని ప్రవీణ్, వర్క్ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి గాంధీజీ విద్యాలయంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**శ్రీకృష్ణ గోపికల వేషధారణలో అలరించిన విద్యార్థులు**

**పండుగలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను భావితరాలకు అందిస్తాయి....**

**చండూరు మున్సిపల్ చైర్మన్ ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు**






**క్రైమ్ మిర్రర్,నాంపల్లి :** నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం నాడు ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, గొల్లభామల వేషధారణలో సందడి చేసి ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణ, ఉట్టికొట్టే కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణాష్టమి విశిష్టతను ప్రతిబింబించేలా సాంస్కృత కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తెలంగాణ పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతోపాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పండుగల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను ప్రతి ఒక్కరు భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇమ్ముల్‌నర్వ హెచ్ఎమ్‌డిఎ ప్లాట్ల ఈ-వేలం సక్సెస్

**రూ. 6.57 కోట్ల ఆదాయం**

హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డిఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇమ్ముల్‌నర్వ లేఅవుట్ ఈ-వేలానికి కొనుగోలుదారులు, పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సెప్టెంబర్ 3న నిర్వహించిన ఈ వేలంలో మొత్తం 60 నివాస ప్లాట్లలో తొలి విడతగా 20 ప్లాట్లు అమ్ముడవడమే కాకుండా, రూ. 6.57 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ-వేలంలో అత్యధికంగా చదరపు గజానికి రూ. 21,000 ధర పలకగా, సగటు ధర చదరపు గజానికి రూ. 16,725గా నమోదైంది. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఇమ్ముల్‌నర్వ లేఅవుట్‌లో భూముల ధరలు మరియు పెట్టుబడి అవకాశాలకు మార్కెట్‌లో ఉన్న పెరుగుతున్న డిమాండ్‌ను ఈ వేలం స్పష్టంగా ప్రతిబింబిస్తోందని హెచ్ఎమ్‌డీఏ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో మిగిలిన ప్లాట్లకు కూడా మంచి స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బర్త్‌డే పార్టీకి అని వెళ్లి ఇంటికి తిరిగిరాని యువతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆదిత్య రాణి (19) విద్యార్థిని అప్రత్యక్షం కావడం స్థానికంగా కలకలం రేపింది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 172 వద్ద ఉన్న శ్రీ చైతన్య కళాశాలలో ఆదిత్య రాణి చదువుకుంటోంది. సెప్టెంబర్ 1 న ఉదయం 9:30 గంటల సమయంలో అత్తాపూర్ పిల్లర్ నంబర్ 9 వద్ద ఉన్న తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్తున్నానని, కార్యక్రమం ముగిసిన వెంటనే ఇంటికి తిరిగి వస్తానని తండ్రికి చెప్పి బయలుదేరింది. ఆ సమయంలో తండ్రి వద్ద నుంచి రూ. 100 తీసుకుని వెళ్లింది. అయితే, సాయంత్రం అయినా కుమార్తె ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి రవీందర్, సాయంత్రం 5:00 గంటల ప్రాంతంలో శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యాన్ని సంప్రదించారు. ఆమె కళాశాలకు హాజరు కాలేదని కళాశాల ప్రతినిధులు స్పష్టం చేశారు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, స్నేహితుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. బాధితురాలి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## మంచిరేవుల ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల ఇందిరమ్మ కాలనీలో అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నాలుగు అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఇచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఈ ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనుమతులు లేకుండా అక్రమంగా భవనాలు నిర్మిస్తే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై నిరంతరం నిఘా ఉంచి కూల్చివేతలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

## నేక్నాంపూర్ చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేక్నాంపూర్ డివిజన్‌లో సిఎంసీ కమిషనర్ శ్రీజన, జోనల్ కమిషనర్ అమిత్ పర్యటించారు. రాబోయే గణేష్ నిమజ్జన ఏర్పాట్లతో పాటు ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నేక్నాంపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్ మెరుగు నేక్నాంపూర్ చెరువు నిమజ్జన కుండిలో డ్రైనేజీ నీరు చేరుతున్న తీవ్ర సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నిమజ్జన కుండిలోకి డ్రైనేజీ నీరు రాకుండా ఇన్‌లెట్‌ను వెంటనే మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మురుగునీరు చెరువులోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయంగా బైపాస్ లైన్ ఏర్పాటు చేయాలని మరియు నేక్నాంపూర్ చెరువు పునరుజ్జీవన (సౌందర్యీకరణ) పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని కోరారు. స్థానిక నాయకుల విజ్ఞప్తిపై కమిషనర్ శ్రీజన సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జితేందర్ మెరుగు మాట్లాడుతూ, నేక్నాంపూర్ చెరువు పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం మరియు ప్రజారోగ్యం కాపాడటమే తమ ప్రాధాన్యత అని, అవసరమైన అన్ని పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రజల తరఫున నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# సాగర్ నీటిపై 14లోగా షెడ్యూల్ ఇవ్వాలి

### లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక

### మిర్యాలగూడలో రైతు మహాధర్నా





మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 3: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సాగునీటి విడుదలపై ఈ నెల 14లోగా ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించాలని.. లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) హెచ్చరించారు. రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో ఆయన మాట్లాడారు.

**సాగర్‌లో నీరున్నా.. సాగుకు ఎందుకు ఇవ్వరు?**

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగర్ ఎడమ కాల్వ కింద పంటల సాగుకు నీరు అందించాల్సి ఉన్నా ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన చేయలేదని కేటీఆర్ విమర్శించారు. సాగర్‌లో 180 టీఎంసీల నీరు, 537 అడుగుల నీటిమట్టం ఉన్నప్పటికీ నీటి విడుదలపై ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోందని ప్రశ్నించారు. శ్రీశైలం జలాశయంలో 875 అడుగుల నీరు ఉన్నప్పటికీ వాటిని పోతిరెడ్డిపాడు వైపు తరలిస్తూ ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలంలో 875 అడుగుల నీటిమట్టం ఉన్న సమయంలో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 40 నుంచి 50 టీఎంసీల నీటిని విడుదల చేసి పంటలకు సాగునీరు అందించామని తెలిపారు.

**'మంత్రులకు రైతుల బాధ పట్టడం లేదు'**

జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు రైతుల ప్రయోజనాలను కాపాడడంలో విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు సాగునీరు అందించలేక 'కన్నీళ్ల మంత్రి'గా మిగిలారని వ్యాఖ్యానించారు. ఎస్–ఎల్‌బీసీ సొరంగం కూలిన ఘటనపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు శోచనీయమన్నారు. సాగర్‌లో నీరు ఉన్నా సాగునీరు అడిగితే ఆరుతడి పంటలు వేసుకోవాలని మంత్రులు చెప్పడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నారు.

**హాలియా నుంచి కోదాడ వరకు పాదయాత్ర**

2003లో సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రైతుల ప్రయోజనాల కోసం కేసీఆర్ కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపట్టి నీటి దోపిడీపై అప్పటి ప్రభుత్వాన్ని నిలదీశారని కేటీఆర్ గుర్తు చేశారు. సాగర్‌లో నికర జలాలు ఉన్నప్పటికీ మిర్యాలగూడ, సూర్యాపేట, ఖమ్మం, హుజూర్‌నగర్, నకిరేకల్, పాలేరు నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించకుండా వెలిగొండ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తామని చెప్పారు. సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదలపై స్పష్టత రాకుంటే వేలాది మంది రైతులతో హాలియా నుంచి కోదాడ వరకు పాదయాత్ర చేపడతామని ప్రకటించారు.

**రెండు పంటలకు నీరివ్వాలి**

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాగర్ ఎడమ కాల్వ పరిధిలో రెండు పంటలకు నీరు విడుదల చేయించి రైతులను ఆదుకుంటామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాగర్‌లో 510 అడుగుల నీరు ఉన్న సమయంలోనూ ఎడమ కాల్వ కింద రెండు పంటలకు నీరు అందించామని గుర్తు చేశారు. రైతుల శ్రేయస్సు కోసం 17 రకాల పంటలకు సాగునీరు అందించామని తెలిపారు. నీటి కోసం గతంలో కేసీఆర్ ఉద్యమం చేపట్టారని.. ఇప్పుడు కేటీఆర్ రైతుల కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారని అన్నారు.

**'కాంగ్రెస్ నుంచి ఒక్క రూపాయి రాలేదు'**

మిర్యాలగూడ నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్, కేటీఆర్ విడుదల చేసిన నిధులతో చేపట్టిన పనులనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో వేసిన రోడ్లపైనే కాంగ్రెస్ నాయకులు నడుస్తున్నారని, అప్పట్లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాల ద్వారా ప్రజలు నీరు తాగుతున్నారని విమర్శించారు. వీర్లపాలెం యాదాద్రి పవర్ స్టేషన్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి అవకాశాలు ఇస్తున్నారని ఆరోపించారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో పంటలకు నీరు విడుదల చేయడంతోపాటు స్థానికులకు ఉద్యోగాలు కల్పించే వరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నార్సింగి సర్కిల్‌లో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో మెగా హియరింగ్

### డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు, జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నార్సింగి సర్కిల్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 5, 6 తేదీలలో మెగా హియరింగ్ నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27వ తేదీ నుండి నోటీసులు అందుకుని, ఇప్పటి వరకు వివిధ కారణాల వల్ల హియరింగ్‌కు హాజరుకాని ఓటర్లందరికీ ఇది చివరి అవకాశమని స్పష్టం చేశారు. నోటీసు పొందిన ఓటర్లు తమ పరిధిలోని సంబంధిత సెంటర్లలో ఉదయం 10:00 గంటల నుండి నేరుగా హాజరై తగిన ఆధారాలు చూపించాలని సూచించారు. మణికొండ కమ్యూనిటీ హాల్, నేక్నాంపూర్ కమ్యూనిటీ హాల్, నార్సింగి సర్కిల్ కార్యాలయం, కోకాపేట వార్డ్ కార్యాలయం తేదీలలో తగిన ధ్రువపత్రాలతో హాజరుకాని పక్షంలో, నియమ నిబంధనల ప్రకారం వారి ఓటును తొలగించడం జరుగుతుందని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. ఈ అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

## ఆత్మనిర్భరత వైపు భారత నూనెగింజల రంగం

### హైదరాబాద్‌లో జాతీయ స్థాయి మేధోమథన సదస్సు



గండిపేట(క్రైమ్ మిర్రర్): వికసిత్ భారత్ సాధనలో భాగంగా నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి (ఆత్మనిర్భరత) సాధించే లక్ష్యంతో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ (ఐసిఎఆర్--ఐఐఓఆర్)లో రెండు రోజుల జాతీయ స్థాయి మేధోమథన సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఐఎస్ఓఆర్, ఐసిఎఆర్--ఐఐఓఆర్, ఐసిఎఆర్--ఎన్ఎఎఆర్ఎం సంస్థలు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని బలోపేతం చేసేందుకు విధానపరమైన, సాంకేతిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, పరిశోధకులు, విత్తన సంస్థలు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు. ఐసిఎఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. డి.కె. యాదవ్ అధ్యక్షత వహించగా, పలువురు ప్రముఖ నిపుణులు ప్రసంగించారు. నాణ్యమైన విత్తనాల లభ్యత, నూతన సాంకేతికతల వినియోగం, పరిశోధన–పరిశ్రమల సమన్వయం మరియు రైతులకు మేలైన విపణి అవకాశాలు కల్పించడంపై సదస్సులో సమగ్రంగా చర్చిస్తున్నారు. ఈ సదస్సు ముగింపులో వెలువడే సిఫారసులు భారతదేశాన్ని నూనెగింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి వైపు తీసుకెళ్లడానికి రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడతాయని తెలిపారు.

## నేడు అత్తాపూర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకష్ణ జన్మాష్టమి మహోత్సవాలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవానికి సుమారు లక్ష మంది భక్తులు, సందర్శకులు హాజరవుతారని తెలిపారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఆస్ట్రేలియా, మాయాపూర్‌ల నుంచి సైతం భక్తులు పాల్గొననున్నారన్నారు. 1000 కిలోల పుష్పాలతో వైభవోపేతమైన మహా అభిషేకం, ఆలయ అలంకరణకు సుమారు పది వేల కిలోల పుష్పాలు, వృందావనం నుంచి తీసుకువచ్చిన శృంగార వస్త్రాలతో శ్రీకృష్ణునికి ప్రత్యేక అలంకరణ చేస్తున్నామన్నారు. లక్ష మందికి దర్శన అవకాశంతో పాటు మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ మహోత్సవానికి ప్రముఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

## హైదర్ గూడ డివిజన్ లో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పర్యటన



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ గూడ డివిజన్ లో గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పర్యటించి ఓటరు కేంద్రాలను పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియ లో పేర్లు తప్పులున్న వారు, మ్యాపింగ్ చేసుకోని వారి కి అధికారులు నోటీసులు ఇవ్వగా, వాటికి కావాల్సిన ధృవ పత్రాలను ఓటర్లు ఓటరు కేంద్రాల్లో సమర్పించి ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకుంటున్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ ఏ విధంగా సాగుతున్నది అని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ గా ఉన్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ధ్రువ పత్రాలను తీసుకువస్తున్నారు. వాటిని సిబ్బంది ఎలా అప్ లోడ్ చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఓటరుకు నోటీసు అందచేసి సరియైన ధ్రువ పత్రాలను తీసుకొని వారి ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## కాంగ్రెస్ పాలనలో ధరణి వద్దంటివి.. భూ-భారతి ముద్దంటివి

### మణికొండ, నెక్నాంపూర్‌లో బీఆర్ఎస్ నిరసన





గండిపేట(క్రైమ్ మిర్రర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వెయ్యి రోజుల గడువు పూర్తయినా హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను కలిసి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను వివరించారు. ముఖ్యంగా గత ఐదేళ్ల క్రితం వినియోగించిన నీటికి సంబంధించిన పాత బకాయిలను ప్రస్తుత బిల్లుల్లో చూపిస్తూ వసూలు చేయడం సరికాదని ఫిర్యాదు చేశారు. కొంతమంది సిబ్బంది ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మణికొండ, నెక్నాంపూర్ ప్రాంతాల్లోని సుమారు 1,500 ఎకరాల ఆస్తులను 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆస్తి హక్కులకు భంగం కలుగుతోందని, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 22–ఏ నిషేధిత జాబితా నుంచి తమ ఆస్తులను తొలగించి, ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో రూ.7.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ఆదేశాల మేరకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దుర్గానగర్‌లోని శ్రీనివాస హాస్పిటల్ సమీపంలో రూ. 7.50 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు ధనుంజయ మాట్లాడుతూ స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సహకారంతో డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి. ప్రేమ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, యంజాల మహేష్ రాజ్ నేత, ఆంజనేయులుగౌడ్, బండారి యాదగిరి నేత, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, ప్రసాద్, రాజు, శ్రావణ్, అర్చకులు ఈశ్వర్ , శ్రీపాల్‌రెడ్డి, ఫయీం భాయ్‌తో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

### ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా

## కలిసిన ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఓబీసీ రాష్ట్ర కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఓబీసీ వర్గాల సమస్యలు, హక్కుల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని శ్రీధర్‌కు ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో సమర్థవంతంగా పనిచేసి ఓబీసీ వర్గాలకు మరింత సేవలందించాలని సూచించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.